విశాలాంధ్ర

ప్రకాశం

బాపట్ల

గురువారం 21 నవంబర్ 2024 8 పేజీలు

విద్యార్థుల ఆరోగ్యంపై వాకబు

- కస్తూర్బాలో మండల అధికారుల పరిశీలన
- జ్వరం, రక్తహీనతతో బాధపడుతున్న పలువురి గుర్తింపు
- పరిసరాలు, డైనింగ్ హాల్ వద్ద అపరిశుభ్ర వాతావరణం

విశాలాంధ్ర-తాళ్లూరు : కస్తూర్బా గాంధీ పాఠశాలను బుధవారం ఎంపీడీఓ సుందర రామయ్య, ఎంఈఓ జి.సుబ్బయ్యలు తనిఖీ నిర్వహించారు. పాఠశాలలో రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థుల గురించి 'సరైన వైద్యం అందించలేరా...' అంటూ 'విశాలాంధ్ర' దినపత్రికలో వార్త ప్రచురితం కావటంతో స్పందించిన అధికారులు పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యంపై వాకబు చేసారు. పలువురు రక్తహీనత, జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించారు. విద్యార్థులు 6 గ్రాముల నుండి 8 గ్రాములు రక్తం ఉన్నట్లు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది గుర్తించారు. సరియైన శ్రద్ధ తీసుకోని ఆరోగ్య కార్యకర్తకు షోకాజ్ నోటీస్ ఇవ్వాలని ఆదేశించారు. పరసరాలు దుర్వాసన రావటం గమనించి మురుగు నీటి కాలువ శుభ్రత చేయించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. డైనింగ్ హాల్, వంటశాలలో శుభ్రతగా లేక పోవటం గుర్తించారు. విద్యార్థులు సరియైన డైట్ తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని, ఏవైనా ఇబ్బందులు ఉంటే తెలియజెయ్యాలని కోరారు. ప్రిన్సిపాల్ సుజిత పాల్గొన్నారు.

ఫీజుల కోసం అప్పులు

- రీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థుల అవస్థలు
- పరీక్ష ఫీజుకు కాలేజీ ఫీజుకు ముడిపెడుతున్న కళాశాల యాజమాన్యాలు
- బంగారం తాకట్టు పెట్టి ఫీజులు కడుతున్న తల్లిదండ్రులు

విశాలాంధ్ర-టంగుటూరు:

విద్యా సంవత్సరం 2024-25 ప్రారంభమై ఆరు నెలలు గడుస్తున్న విద్యా విధానాలను ప్రభుత్వం వెల్లడించక పోవడం వలన విద్యార్థుల్లో తల్లిదండ్రులలోనే కాక కళాశాల యాజమాన్యాలలోను గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. గత ప్రభుత్వం విద్యా దీవెన, వసతి దీవెన పేర్లతో తల్లిదండ్రుల ఖాతాలో డబ్బులు జమ చేసేది, వారు కళాశాల యాజమాన్యాలకు చెల్లించేవారు. గత జూన్ నెలలో కొత్త ప్రభుత్వం ఏర్పడింది అయితే నేటికీ విద్యా విధానాలు ఫీజు రీయింబర్స్మెంట్ తదితర విషయాలకు సంబంధించి స్పష్టతను ఇవ్వలేదు. ఫీజు రీయింబర్స్మెంట్ గత ప్రభుత్వం మాదిరిగా తల్లిదండ్రుల ఖాతాలో జమ చేస్తారా లేక యాజమాన్యాలకు ప్రభుత్వమే చెల్లిస్తుందా అనే విషయంపై స్పష్టమైన అధికారిక వైఖరిని వెల్లడి చేయలేదు. ప్రస్తుతం కళాశాలలో పరీక్ష ఫీజు చెల్లించే సమయంలో యాజ మాన్యాలు ఫీజులు చెల్లించాలని విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నారు. రీ ఇంబర్స్‌మెంట్ వస్తే మీరు చెల్లించిన ఫీజులు మీకు తిరిగి ఇస్తామని యాజమాన్యాలు ఫీజులు వసూలు చేస్తున్నాయి. కొండపి నియోజకవర్గం పరిధిలో దాదాపుగా వ్యవసాయ ఆధారిత, కూలి పనులు చేసుకునే కుటుంబాలే ఎక్కువ. చిన్న సన్న కారు రైతులు తమకు సాగు భూమి లేకపోయినా కౌలుకు తీసుకుని పొగాకు శనగ మిర్చి వంటి వాణిజ్య పంటలను సాగు చేస్తున్నారు. ఈ సీజన్లోనే వ్యవసాయ పనులు ప్రారంభించడానికి తలకు మించిన అప్పులు చేస్తూ ఉంటారు. అయితే కుటుంబ జీవనం కోసం వ్యవసాయానికి పెట్టుబడి పెట్టాలా? పిల్లల ఫీజులు కట్టాలా? అనే సందిగ్ధంలో చేసేది లేక పుస్తెలు తాకట్టు పెట్టి ఫీజులు కడుతున్నారు. టంగుటూరు మండలంలో రెండు ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి వాటిలోనే ఈ ప్రాంతానికి చెందిన వందలాదిమంది విద్యార్థులు ఇంజనీరింగ్ విద్యను అభ్యసిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజు రీయింబర్స్మెంట్‌పై స్పష్టత నివ్వాలని విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు కళాశాల యాజమాన్యాలు కోరుకుంటున్నారు.





ఇష్టంతో చదవండి

- మంచి విద్యా ప్రమాణాలను సాధించండి
- మాదక ద్రవ్యాలకు, అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలి
- ఇంజనీరింగ్ విద్యార్థులకు డీఎస్పీ యు.నాగరాజు ఉద్బోధ

విశాలాంధ్ర-మార్కాపురం : రోజురోజుకు పెరుగుతున్న పోటీ ప్రపంచంలో ఇష్టంతో చదువుతూ మరోవైపు అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉంటూ ఉజ్వల భవిష్యత్తును రూపొందించుకొని అందుకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని డీఎస్పీ డాక్టర్ యు.నాగరాజు విద్యార్థులకు ఉద్బోధించారు. 'అసాంఘిక కార్యక్రమాలు..మాదక ద్రవ్యాలు - దుష్ప్రభావం' అనే అంశంపై బుధవారం స్థానిక ఏ 1 గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న పోటీ ప్రపంచంలో కష్టపడి కాకుండా ఇష్టంతో విద్యను అభ్యసించాలని, అప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని అన్నారు. ఎంతో కష్టపడి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ మీ ఉజ్వల భవిష్యత్తు కోసం ఎంతో శ్రమించి కళాశాలకు పంపుతున్నారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ వన్ గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ అలీ బెగ్, డైరెక్టర్ మీర్జా మహమ్మద్ మసూద్ అలీ బెగ్, ప్రిన్సిపాల్ డాక్టర్ సి హెచ్ శ్రీధకర్, రూరల్ ఎస్సై అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.

కమర్షియల్ టాక్స్ ఆఫీసులో అవినీతి తిమింగలం

- రూ.1.50 లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం
- అవినీతి అధికారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు

2లో

- విశాలాంధ్ర, ఒంగోలు

తుపాను హెచ్చరికలతో ముందస్తు చర్యలు తీసుకోవాలి

బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి

2లో

కమర్షియల్ టాక్స్ ఆఫీసులో అవినీతి తిమింగలం

విశాలాంధ్ర-ఒంగోలు : ఒంగోలు కమర్షియల్ టాక్స్ కార్యాలయంలో అవినీతి తిమింగలాన్ని ఏసీబీ అధికారులు బుధవారం పట్టుకున్నారు. ఫిర్యాది నుండి రూ.1.50 లక్షలు లంచం తీసుకుంటూ పట్టుపడ్డారు.ఈ సందర్భంగా ఏసీబీ ఇన్స్పెక్టర్ శేషు మీడియాతో మాట్లాడుతూ ఒంగోలు కమర్షియల్ టాక్స్ ఆఫీసులో డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ కె ఎస్ శ్రీనివాస ప్రసాద్ చిడిపోతు శ్రీధర్ కు సంబంధించిన శ్రీ వెంకటేశ్వర ఆక్వా ట్రేడర్స్, మరో రెండు ఫారమ్ లకు సంబంధించి రూ. ఆరు లక్షలు టాక్స్ కట్టాలని నోటీసులు అందించారన్నారు. దీనికి సంబంధించి తనను కలవాలని తెలిపారు అన్నారు. దీంతో శ్రీధర్, శ్రీధర్ అకౌంటెంట్ శ్రీనివాసరావులు శ్రీనివాస ప్రసాద్ ను కలిశారన్నారు. దీంతో శ్రీనివాస ప్రసాద్ ఇటువంటి పన్నులు చెల్లించకుండా ఉండేందుకుగాను రెండు లక్షల రూపాయలు లంచం డిమాండ్ చేశారు అన్నారు. చివరకు 1,50,000 కు ఒప్పందం కుదుర్చుకున్నారు అన్నారు. ఈ విషయమై శ్రీధర్ ఏసీబీ ని ఆశ్రయించారన్నారు. బుధవారం లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు శ్రీనివాస ప్రసాద్ ను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారన్నారు. గురువారం నెల్లూరు కోర్టులో శ్రీనివాస ప్రసాద్ ను హాజరు పరుస్తామని తెలిపారు.

సీఎం చంద్రబాబుని కలిసిన ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరిలో జరిగే అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు నరసింహారెడ్డి బుధవారం వినతిపత్రం అందజేశారు. కనిగిరిలో త్రిబుల్ ఐటీ కాలేజ్ ఏర్పాటుకు సహకారం కనిగిరి ప్రభుత్వాస్పత్రిలో వైద్యుల నియామకం చేపట్టాలని కోరారు. కనిగిరి ప్రభుత్వాస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన కంగారు మదర్ కేర్ కేఎంసి విధానం గురుంచి సీఎం చంద్రబాబు గారికి వివరించారు. సానుకూలంగా స్పందించిన సీఎం కేఎంసి విధానం పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో తొలి రిలయన్స్ బయో గ్యాస్ ప్లాంట్ ఏర్పాటు కనిగిరిలో ఏర్పాటుపై సీఎం చంద్రబాబుకు ఉగ్ర కృతజ్ఞతలు తెలిపారు.

పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోండి

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమశాఖ ద్వారా పోస్ట్ మెట్రిక్‌కు అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థులు జ్ఞాన భూమి సైట్ లో నమోదు చేసుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి లక్ష్మానాయక్ కోరారు. జిల్లాలోని అన్ని కళాశాలల యాజమాన్యాల వారు ఈనెల 30వ తేదిలోపు విద్యార్థులను జ్ఞాన భూమి సైట్ లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయ్యాలని కోరారు. విద్యార్థులు వారి మండలాలు, గ్రామాలలో సచివాలయాల పరధిలో వేల్ఫేర్ అసిస్టెంట్స్, విద్యా సహాయకులను సంప్రదించి ఫైవ్ స్టెఫ్ వెరిఫికేషన్ పూర్తి చేసుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని, కళాశాలల యాజమాన్యాలు తల్లిదండ్రులకు త్వరిత గతిన విషయాన్ని తెలియజేసి రిజిస్ట్రేషన్ ప్రక్రియ సకాలంలో పూర్తి చేయ్యాలని కోరారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నాగులుప్పలపాడు, ఉప్పుగుండూరు శాఖా గ్రందాలయాల్లో బుధవారం ముగింపు వేడుకలు నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులకు నిర్వహించిన వివిదపోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందచేసారు. నాగులుప్పలపాడు పంచాయతీ కార్యదర్శి ఏ.శరత్ బాబు,ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్ చార్జి ప్రధానోపాధ్యాయులు యన్.అంజిరెడ్డి, తెలుగు ఉపాధ్యాయులు కె.అనురాధ, సచివాలయం మహిళా పోలీస్ యన్.సౌజన్య, గ్రందపాలకులు ప్రసాదు పాల్గొన్నారు.

తుపాను హెచ్చరికలతో ముందస్తు చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - బాపట్ల :

తుపాను హెచ్చరిక నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రాణ నష్టం జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. తుపాను హెచ్చరిక నేపథ్యంలో జిల్లా,మండల స్థాయి అధికారులతో కలెక్టర్ బుధవారం వీక్షణ సమావేశం నిర్వహించారు. మత్స్యకారులు వేట కొరకు సముద్రంలోకి వెళ్ళరాదని జిల్లా కలెక్టర్ ప్రకటించారు. బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోని ఏర్పడదంతో వాతావరణ శాఖ నుంచి హెచ్చరికలు వచ్చాయన్నారు. అల్పపీడనం తపానుగా మారే అవకాశం ఉందన్నారు. ఈనెల 27వ తేదీ వరకు సముద్రంలోకి మత్స్యకారులను వెళ్ళనివ్వరాదని చెప్పారు. ఇప్పటికే వేటకు వెళ్లి ఉన్న మత్స్యకారులు వెంటనే బయటకు పిలిపించాలని ఆదేశించారు. ఒక్కరికి ప్రాణ నష్టం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. భారీ వర్షాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ తదనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు. చేతికి అందివచ్చిన ధాన్యం పంటను 22 నుంచి 27వ తేదీ వరకు కోయ రాదన్నారు. రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదవశాత్తు వర్షాలకు చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలినా,రహదారులు దెబ్బతిన్నా తక్షణమే పునరుద్ధరించడానికి అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ చెప్పారు.ఈ వీక్షణ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉద్యోగాల భర్తీ

అంగన్వాడి కార్యకర్తలు, ఆయాల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాల ఇంటర్వ్యూ కార్యక్రమం బుధవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో జరిగింది. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఇంటర్వ్యూలకి 109 మంది అభ్యర్థులు హాజరయ్యారు. రెండు అంగన్వాడి కార్యకర్తల ఉద్యోగానికి ముగ్గురు హాజరు కాగా, 44 ఆయాల ఉద్యోగాలకు 106 మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మహిళ శిశు అభివృద్ధి శాఖ పీడీ ఉమా, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సూర్యలంక తీరంలో వసతులు మెరుగుపరచండి

అసెంబ్లీలో తొలిసారి మాట్లాడిన బాపట్ల ఎమ్మెల్యే వేగేశన

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల :

సూర్యలంక సముద్రతీరంలో పర్యాటకులకు వసతులు మెరుగుపరచాలని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ కోరారు. బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశం జీరో అవర్‌లో ఎమ్మెల్యే వేగేశన తొలిసారిగా అధ్యక్షా అంటూ సంభోదిస్తూ సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వేగేశన మాట్లాడుతూ బాపట్ల సూర్యలంక తీరం రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన బీచ్ అని హైదరబాద్, విజయవాడ రెండు రాష్ట్ర రాజధానుల నుంచి ప్రజలు, పర్యాటకులు తరచుగా వస్తుంటారన్నారు. వసతులు అంతంతమాత్రంగానే ఉన్నాయని వసతులు కల్పించేందుకు కృషి చేయాలన్నారు. బ్రిటీష్ కాలంలో బాపట్ల చీరాల సముద్ర తీరం వెంబడి రాజదండు రోడ్డు పేరుతో 80 అడుగుల రోడ్డును ఏర్పాటు చేశారన్నారు. దానికి అనుసందానంగా చీరాల మండలంలో ఉన్న ఈపురుపాలెం స్ట్రైట్‌కట్ ఒక వంతెన నిర్మించి రెండు ప్రాంతాలను కలపాల్సిన అవశ్యకత ఉందన్నారు. రోడ్డు నిర్మాణం సుమారు 15 కిలోమీటర్ల చేపట్టాల్సి ఉంటుందన్నారు. సముద్ర తీర ప్రాంతాల్లో 5 స్టార్ హోటల్స్ నిర్మాణం జరుగుతుందన్నారు. చీరాల నుంచి హైదరబాద్‌కు కొత్త నూతన రోడ్డు నిర్మాణం జరుగుతుందని ఏడాదిలో పూర్తవుతుందన్నారు. చీరాల, పర్చూరు, నరసరావుపేట నుంచి నార్కెట్‌పల్లి మీదగా హైదరబాద్‌కు నాలుగు గంటల సమయంలో చేరుకోవచ్చున్నారు. సూర్యలంక తీరంలో వసతులు కల్పించి పర్యాటక రంగాన్ని అభివృద్ధి పరచాలని కోరారు.

మహిళా కబడ్డీ పోటీలకు ఎంపిక

విశాలాంధ్ర-టంగుటూరు :

అళగప్ప యూనివర్సిటీలో జరిగే మహిళా కబడ్డీ పోటీలలో జేఎన్టీయూకే యూనివర్సిటీ తరుపున ఆడే 12 మంది టీంలో రైజ్ కృష్ణ సాయి గ్రూప్‌కు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపిక అయ్యారని కళాశాలల సెక్రటరీ శిద్దా హనుమంత రావు తెలియచేసారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.వి. భాస్కరరావు మాట్లాడుతూ యూనివర్సిటీ తరుపున ఆడేందుకు ప్రతిభ గల 12 మంది సభ్యులను ఎంపిక చేయడము, అందులో రైజ్ కళాశాల విద్యార్థినులు ఇద్దరు పి.అంజనీ దేవి సెకండ్ ఇయర్ ఈసీఈ రైజ్ ప్రకాశం, డి.వి.సుస్మిత -థర్డ్ ఇయర్ ఈసీఈ, రైజ్ గాంధీ ఉండటము హర్షదాయకమని, క్రీడలపై ఆసక్తి ఉండటం వలన వారు మానసికంగా ఏంతో ఉత్సహముగా ఉండేందుకు దోహదపడుతాయని ఎంపిక అయిన విద్యార్థినులను అభినందించారు. 12 మంది సభ్యులతో కూడిన జేఎన్టీయూకే యూనివర్సిటీ జట్టు ఈ నెల 29 నవంబర్-డిసెంబర్ 2వ తేదీలలో తమిళనాడు రాష్ట్రములోని అళగప్ప యూనివర్సిటీ కరైకుడిలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ మహిళా కబడ్డీ టోర్నమెంట్‌లో జేఎన్టీయూకే యూనివర్సిటీ తరుపున ఆడతారని ఫిజికల్ డైరెక్టర్స్ ఎస్. హిమచంద్ర బాబు, యన్.సుబ్బారావు తెలియ చేశారు. యూనివర్సిటీకి సెలెక్ట్ అయిన విద్యార్థులను కళాశాల చైర్మన్ ఇస్కాల చిన రంగమన్న అభినందించారు.

గ్రామాల్లో క్షేత్రస్థాయిలో అభివృద్ధి జరగాలి

విశాలాంధ్ర-జరుగుమల్లి : జరుగుమల్లి మండల పరిధిలోని చింతలపాలెం చిలుకూరుపాడు గ్రామాల్లో పల్లె పండుగ మంజూరైన పనుల ప్రగతిని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జోసెఫ్ బుధవారం పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మండలంలో ఎన్ని గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమాలు భాగంగా డ్రైనేజీ సిమెంట్ రోడ్లు చేపడుతున్నారని ఎంపీడీవో ఎంవి రమణమూర్తిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎన్ఆర్జీఎస్ కార్యాలయంలో క్షేత్రస్థాయి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి గ్రామాల్లో పనులు ఉపాధి కల్పిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కొత్త పనులపై గ్రామాలలో గ్రామసభలు నిర్వహించారా లేదా అని వివరాలు అడిగి చేసే పని గ్రామాల అభివృద్ధి కోసమే చేయాలి తప్ప పనికిరాని పనులను చేయరాదని ఆయన సందర్భంగా హేచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీడి వెంకటస్వామి ఏపీఓ నాగరాజు టెక్నికల్ అసిస్టెంట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

హెచ్ఐవి ఎయిడ్స్‌పై అవగాహన

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : వ్యాధి, సుఖ వ్యాధులు శోకకుండా, ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని హెచ్ఐవి ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్షత విడనాడాలని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ టిఐ నాగులప్పలపాడు మండల అవుట్ రిచ్ వర్కర్ ఎం మల్లేశ్వరి పేర్కొన్నారు. బుధవారం బాపట్ల ప్రకాశం జిల్లాలో హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణ నిర్మూలన సంస్థ, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బివి సాగర్ ఆధ్వర్యంలో నాగులప్పలపాడులో బుధవారం రొయ్యల ప్రాసెసింగ్ కంపెనీలో అవగాహన కార్యక్రమంలో భాగంగా రొయ్యల ప్రాసెస్ కంపెనీలో అవగాహన నిర్వహించారు.

వాహనాలు తనిఖీ

విశాలాంధ్ర-పొన్నలూరు : ప్రతి ఒక్కరు తమ వాహనాలకు సంబంధించిన లైసెన్సులు కలిగి ఉండాలని ఎస్సై అనుక్ పేర్కొన్నారు. స్థానిక పొన్నలూరు సెంటర్ నందు బుధవారం డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులకు లైసెన్సులు వాహన పత్రములు కలిగి ఉండి హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని లేకుంటే వారిపై కేసుల నమోదు చేసి జరిమానాలు విధించడం జరుగు తుందని తెలిపారు.

ఫోక్సో యాక్ట్‌పై అవగాహన

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : పిల్లలకు ఫోక్సో యాక్ట్, ఇతర వ్యక్తులు పిల్లల పట్ల ఎలా ప్రవర్తిస్తారో వాళ్ల గురించి గుడ్ టచ్, బ్యాడ్ టచ్ మీద అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఒంగోలు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎన్. శ్రీకాంత్ బాబు బుధవారం ఒంగోలు రూరల్ సర్కిల్ పరిధిలోని నాగులుప్పలపాడు మండలంలోని అమ్మనబ్రోలు గ్రామంలోని ఏపీ రెసిడెన్షియల్ గర్ల్స్ స్కూల్‌ను సందర్శించి అవగాహన సదస్సు నిర్వహించారు. పిల్లలకు ఫోక్సో యాక్ట్, ఇతర వ్యక్తులు పిల్లల పట్ల ఎలా ప్రవర్తిస్తారో వాళ్ల గురించి గుడ్ టచ్, బ్యాడ్ టచ్ మీద వారికి అవగాహన కల్పించి, క్రైమ్ ఎగైనెస్ట్ ఉమెన్, మహిళల పట్ల జరిగే నేరాలను ఏ విధంగా ఉంటాయో వారికి వివరించారు. సైబర్ క్రైమ్, డ్రగ్స్ వాడటం వలన జరిగే అనర్థాలు గురించి తెలియజేసినారు. బైక్ మీద వెళ్లేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించి వెళ్లాలని, ఆటోలలో వెళ్లేటప్పుడు నలుగురికి మించి వెళ్లరాదని, రోడ్డు యాక్సిడెంట్లు ఎలా జరుగుతున్నాయో, వాటిని ఎట్లా అధిగమించాలో వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రెసిడెన్షియల్ కాల్స్ స్కూల్ ప్రిన్సిపాల్ కే మాధవి పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధిలో దాతల సహకారం మరువ లేనిది

విశాలాంధ్ర-సీఎస్‌పురం : పాఠశాల అభివృద్ధిలో దాతల సహకారం మరువ లేనిదని కదిరి వెంకట నరసయ్య లక్ష్మమ్మ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ప్లస్ ప్రధానోపాధ్యాయులు నాగినేని తిరుపతయ్య అన్నారు. బుధవారం కోవిలంపాడు మాజీ సర్పంచ్ సయ్యద్ బీబీ దౌలత్ 25 కుర్చీలు, కోవిలంపాడు మాజీ ఎంపీ టీసీ సభ్యులు మూరం కాశిరెడ్డి 20 కుర్చీలు పాఠశాలకు బహూకరించారు. పాఠశాల అభి వృద్ధిలో దాతలు భాగస్వాములు కావడం ఆనందదాయకమని వారి దాతృత్వాన్ని గురించి కొనియాడారు. కోయిలంపాడు మాజీ సర్పంచి మాజీ ఎంపీటీసీ సభ్యులు బీబీ దౌలత్, మూరం కాశిరెడ్డిలకు పాఠశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

లక్ష్యంలేని చదువు వ్యర్థం

విశాలాంధ్ర-గిద్దలూరు : లక్ష్యంలేని చదువు వ్యర్థమని గిద్దలూరు నగర పంచాయతీ కమిషనర్ వెంకట దాస్ అన్నారు. గిద్దలూరు శాఖ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన కార్య క్రమములో ముఖ్య అతిథిగా అయన పాల్గొన్నారు. తొలుత సరస్వతిదేవి విగ్రహానికి పూలమాల వేశారు. మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితంలో మూడు లక్ష్యాలను ఎంచుకోవాలని లక్ష్యం లేని చదువు వ్యర్థం అన్నారు. వారోత్సవాల సందర్భంగా వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో గెలు పొందిన విజేతలకు బహుమతుల ప్రధానోత్సవం జరిగినది. కమిషనర్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకులు ప్రసన్న కుమారి జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు స్వరూప రెడ్డి విశ్రాంత ఉద్యోగ సంఘం అధ్యక్షులు రవీంద్ర రెడ్డి పాతాళ నాగేశ్వర స్వామి దేవాలయం మాజీ చైర్మన్ శివాపురం ఆంజనేయులు వేంకటేశ్వర స్వామి దేవాలయం అధ్యక్షులు గంజి వీరయ్య విశ్రాంత ఉపాధ్యాయులు రామిరెడ్డి విశ్రాంత ఉపా ధ్యాయులు, మునల్ రెడ్డి ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగ గురువు బీఎస్ఎన్ నారాయణరెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు నర్సిరెడ్డి పాల్గొన్నారు.

గొంగళి, లద్దె పురుగులను నివారించండి

విశాలాంధ్ర-వెలిగండ్ల : మినుము, వరి పంటలలో గొంగళి, లద్దె పురుగుల నివారణకు రైతులు చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారి రంగాకృష్ణ కోరారు. బుధవారం మండలంలోని గండ్లో సీతారాంపురం, వెదుళ్ళ చెరువు గ్రామా లలో పొలం పిలుస్తుంది నిర్వహించారు. నివారణ కొరకు రైతులు తగు చర్యలు చేపట్టి పంటకు నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

మూతపడిన మత్స్యశాఖ కార్యాలయం

కార్యాలయ ముఖం చూడని మత్స్య శాఖ అభివృద్ధి అధికారి

విశాలాంధ్ర-టంగుటూరు : టంగుటూరు మండలంలో మత్స్యశాఖ అభివృద్ధి వారి కార్యాలయం మరియు ఆక్వా ల్యాబ్ ఉన్నది. గత కొన్ని నెలలుగా ఆ కార్యాలయం తలుపులు తెరుచుకున్న పాపాన పోలేదు. పాడుబడిన కార్యాలయాన్ని తలపిస్తూ అక్కడ చెత్తాచెదారంతో జనాలు సంచరించిన ఆనవాళ్లు కూడా కనబడటం లేదు. మండల మత్స్య శాఖ అభివృద్ధి అధికారి ఆ కార్యాలయంలో విధులు నిర్వర్తించిన దాఖలాలు లేవని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజల కష్టార్జితంతో ప్రభుత్వ ఉద్యోగులు వేలకు వేలు జీతాలు తీసుకుంటూ కనీసం ప్రభుత్వ కార్యాలయాల తలుపులు తీయకుండా ప్రజలకు ముఖం చాటేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. లక్షల్లో ఆక్వా సాగు చేసే డబ్బున్న వారికి మాత్రమే ఆయన అందుబాటులో ఉంటాడని, మత్స్య శాఖలో వివిధ పథకాల గురించి సబ్సిడీ వివరాల గురించి సామాన్య ప్రజలు తెలుసుకుందామంటే మత్స్య శాఖ కార్యాలయం మూతపడి ఉంటుందని కనీసం కార్యాలయంలో పనిచేసే సిబ్బంది ఫోన్ వివరాలు కూడా అక్కడ లేవని ప్రజలు చెప్పున్నారు. ఈ ఆరోపణలపై మండల మత్స్యశాఖ అభివృద్ధి అధికారిని ఫోన్లో సంప్రదించగా కొత్తగా ఓ వ్యక్తిని మూడు రోజుల క్రితం నియమించామని మంగళవారం అతనికి ఆరోగ్యం బాగాలేక రాలేదని బదులిచ్చాడు. అయితే బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు కూడా కార్యాలయ తలుపులు తెరచుకోలేదు. ప్రజల సొమ్ముతో జీతాలు తీసుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉండని అధికారులపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

యువత ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలి

విశాలాంధ్ర-సంతనూతలపాడు : 18 ఏళ్ళు నిండిన యువత యువకులు నూతనముగా ఓటుకు కోసం ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సురేష్ బాబు కోరారు. పేర్నమిట్టలోని శ్రీ ప్రతిభ జూనియర్ కళాశాల సరస్వతి జూనియర్ కళాశాల ఎండ్లూరు డొంక వద్ద గల మహిళ ప్రాంగణమునందు బుధవారం నూతన ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈనెల 23 24 తేదీలలో అన్ని బిఎల్ఓ కేంద్రాలలో నూతన ఓటు నమోదు చేర్పులు సవరణలు ప్రత్యేక కార్యక్రమం జరు గుతుందని వారు తెలిపారు. ఎంఈఓ డి.ఎంకా రెడ్డి ఎమ్మార్వో కార్యాలయ ప్రతినిధి ఎంవి రమణ అధ్యాపకులు పాల్గొన్నారు.

'పొలం పిలుస్తోంది' రైతులకు వరం

విశాలాంధ్ర-దర్శి : వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పొలం పిలుస్తుంది రైతుల పాలిట వరం అని వ్యవసాయ శాఖ అధికారి బాలకృష్ణ నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని రామచంద్రాపురం రైతు సేవ కేంద్రం నందు ఉదయం, బసిరెడ్డిపాలెం రైతు సేవ కేంద్రం నందు మధ్యాహ్నం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహిం చడం జరిగింది. ఈ కార్యక్రమలలో మండల వ్యవసాయ అధికారి వి.బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ 2024 రబీ సీజన్ మొదలవుతుంది. రైతులందరూ పంట నమోదు చెపించుకోవాలని అలాగే వరి, ఎండు మిరప, మినుములు, శనగ మొక్కజొన్న, జొన్న రైతులు పంట బీమా చెపిచ్చు కోవాలని తెలియచేశారు. (వరి పంటకు బీమా కొరకు డిశంబర్ 31వరకు ఉంటుందన్నారు. ఈ కార్య క్రమంలో రామచంద్రాపురం గ్రామ రైతు సేవ కేంద్రం నుండి గ్రామ ఉద్యాన సహాయకులు పాతలవత్ కోటేశ్వరరావు నాయక్. బసిరెడ్డిపల్లి రైతు సేవ కేంద్రం నుండి గ్రామ వ్యవసాయ సహాయకులు వి.చంద్రకాంత్, ఆయా గ్రామల రైతులు, ప్రజా ప్రతినిధులు పాలుపంచుకున్నారు.

ఎల్.కోట ప్రాథమిక పాఠశాల తనిఖీ

విశాలాంధ్ర-కంభం : కంభం మండలంలోని ఎల్కోట అంగన్వాడీ కేంద్రాన్ని, ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎంఈఓ శర్వాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల విద్యార్థుల భాషా నైపుణ్యాలు, గణిత సామర్థ్యాలను, పాఠశాల వసతులు, సౌకర్యాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. డొక్కాసీతమ్మ మధ్యాహ్న బడి భోజనాల రుచి, నాణ్యతలలో రాజీపడవద్దని సూచించారు. అంగన్వాడి కేంద్రంలోని రికార్డులను విద్యార్థుల హాజరును పరిశీ లించారు. ఈ కార్య క్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ పద్మావతి దేవి, ప్రధానో పాధ్యాయిని జి.అభిగైల్ పాల్గొన్నారు.

పాఠకులకు గ్రంథాలయాలే మార్గదర్శకాలు

విశాలాంధ్ర-తర్లుపాడు : గ్రంథాలయాలు పాఠకులకు మార్గదర్శకాలుగా జీవితంలో ఉపయోగపడతాయని మండల విద్యాశాఖాధికారిని దేవరకొండ సుజాత పేర్కొన్నారు. స్థానిక శాఖగ్రంథాలయం తర్లుపాడులో 57వ జాతీయ గ్రంథాల వారోత్సవాలు గ్రంధ పాలకుడు పి.వి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 14 నుండి 20వ తేదీ వరకు గ్రంథాలయ భవన ప్రాంగణంలో ఉత్సాహభరితంగా విద్యార్థుల మధ్య పోటీలు నిర్వహించడం జరిగినది. దీంతో బుధవారం ముగింపు సమావేశం క్రింద పాలకూర అధ్యక్షతన ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖాధికారులు దేవరకొండ సుజాత, అచ్యుత సుబ్బారావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముత్తోజు సుధాకర్‌లు పాల్గొన్నారు. అనంతరం గెలుపొందిన విజేతలకు దాతలైన కీర్తిశేషులు పెరుమాళ్ళ పుల్లయ్య జ్ఞాపకార్థం మనుమడు కిరణ్ కుమార్, కీర్తిశేషులు వాడేల వెంకటేశ్వర్లు కుమారుడు వాడేల కృష్ణ ప్రసాద్, పిడిసిసి బ్యాంక్ మేనేజర్, మండల నెహ్రూ యూత్ అధ్యక్షులు బెదుదూరి పుల్లయ్యల చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని మీర్జా పేట, పొడివారిపల్లి, చెన్నారెడ్డిపల్లి, పోతులపాడు, తుమ్మలచెరువు, కలుజువ్వలపాడు, తర్లుపాడు తదితర పాఠశాల నుండి సుమారు 150 మంది విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కోటి మోహన్, గోను శ్రీనివాసులు, పి.రామయ్య, ఎం ప్రభాకర్ గ్రామ పెద్దలు దొండేటి గురువారెడ్డి గ్రంథాలయ జాతీయ వారోత్సవాలలో పాల్గొని ఘనంగా నిర్వహించారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

విశాలాంధ్ర-బేస్తవారిపేట : మండలంలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈఓ-1 కె. కాశయ్య బుధవారం పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సట్టి శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీపీసీఎల్ ప్రతినిధులతో ఎమ్మెల్యే విజయ్ కుమార్ సమీక్ష

విశాలాంధ్ర-సంతనూతలపాడు : ఒంగోలు జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు బుధవారం బిపిసి యల్ పైపులైను గురించి జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ సమక్షంలో ఎమ్మెల్యే విజయ్ కుమార్ చర్చ నిర్వహించారు. మండలంలోని పేర్నమిట్ట పెద్ద చెరువు మధ్యలో గుండా వేస్తున్న బిపి సీఎల్ పైపులైను వల్ల స్థానిక గ్రామ ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పైపులైను వల్ల రైతులకు కలిగే నష్టాలు గురించి బిపి సిఎల్ ప్రతినిధులతో ఎమ్మెల్యే విజయ్ కుమార్ వివరించారు. ఈ పైపులైను చెరువు నుండి దూరముగా వేయాలని కోరారు. ఈ సందర్భంగా జెసి గోపాలకృష్ణ మాట్లాడుతూ చెరువులో నుండి పైపులేని వేయకుండా వేరే దారిలో వేయాలని బిపిసిఎల్ ప్రతినిధులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ్ కుమార్ రైతులు జెసి గోపాలకృష్ణకు అభినందన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎమ్మార్వో సర్వేయర్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర epaper.visalaandhra.com గురువారం 21 । నవంబర్ । 2024

ఉపాధ్యాయులకు యాప్‌లపై అవగాహన

విశాలాంధ్ర-బేస్తవారిపేట : ఉపాధ్యాయులు విద్యాశాఖ నిర్వహించే యాప్‌లపై అవగాహన కలిగి ఉండాలని ఎంఈఓలు కె.కాశయ్య, సీవీ రమణారెడ్డిలు పేర్కొన్నారు. మండలంలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశాలను వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకుంటూ నిత్య విద్యార్థులుగా ఉండాలని, వినూత్న ఆవిష్కరణలను అవగతం చేసుకుంటూ, తరగతి గదిలో అమలుచేసేందుకు ప్రణాళికలను రూపొందించు కోవాలని సూచించారు. యాప్‌లపై అవగాహన కలిగి ఉండడంతో పాటు లెసన్ ప్లాన్స్ తయారు చేయాలని, సీసీఈ మార్కుల నమోదు, విద్యార్థుల అపార్ ఐడీ జనరేషన్ కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో కలసి డిజిటల్ శిక్షణ తరగతులను వీక్షించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ చైర్మన్ ఎస్ శ్రీనివాసులు కార్యదర్శి పి. కృష్ణారెడ్డి, సీఆర్పీలు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి సమయపాలన తప్పనిసరి

విశాలాంధ్ర-పీసీపల్లి : సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఎంపీడీవో ప్రభాకర్ శర్మ అన్నారు. బుధవారం మండలంలోని గుదేవారిపాలెం పెద అలవలపాడు గ్రామ సచివాలయాలను అకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీడీఓ సిబ్బందితో మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయపాలన తప్పనిసరిగా పాటించాలని అదే విధంగా సిబ్బంది సచివాలయానికి వచ్చినప్పుడు మరియు వెళ్ళినప్పుడు బయోమెట్రిక్ అటెండెన్స్ రిజిస్టర్లో సమయం రాయాలని సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం ఎంపీడీఓ సర్వే జియో టాకింగ్ సర్వేలపై సచివాలయ సిబ్బందికి తగు సూచనలో సలహాలు తెలియజేశారు. పలు రికార్డులను రికార్డులను పరిశీలించారు. గ్రామాలలో జరుగుతున్న క్యాటిల్ సెడ్స్ ఎన్విసిఐ సర్వేలను నిర్మాణ పనులనుపరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు కార్యక్రమంలో గొర్రెపాటి, దారపనేని

విశాలాంధ్ర-పామూరు : పట్టణంలోని బాలాజీ జ్యువెలర్స్ అధినేత గుత్తి వెంకటరాజా, బుజ్జమ్మ దంపతుల కుమారుడు గుత్తి అనిల్ కుమార్, కొత్తపట్నంకు చెందిన సుంకరి రాంబాబు, అంజలి దంపతుల కుమార్తె లక్ష్మి యశ్వినిల నిశ్చితార్థ వేడుకలు ఒంగోలు పట్టణంలోని విష్ణు ప్రియ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ నిశ్చితార్థ వేడుకలలో ప్రముఖులు గొర్రెపాటి శ్రీనివాసరావు, కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నేపల్లి లక్ష్మీనారాయణ, కనిగిరి నియోజకవర్గ బీజేపీ ఇన్చార్జ్ కొండశెట్టి వెంకటరమణయ్య, ఉప్పలపాటి హరిబాబు, సిఎస్‌పురం మాజీ సింగల్ విండో అధ్యక్షులు బోయిల్ల నారాయణరెడ్డి, పామూరు మాజీ సర్పంచ్ కావిటి వెంకట సుబ్బయ్య, పామూరు ఉపసర్పంచ్ యాదాల సాయికిరణ్, పోతురాజు వెంకటరత్నం, పాలపర్తి వెంకటేశ్వర్లు, గద్దె సుధాకర్, చలి వేంద్రం సుబ్బారావు, గుత్తి రమణయ్య, ఒగూరి నరసింహారావు, వరికూటి చిరంజీవిలు పాల్గొని వధూవరులను అక్షింతలతో ఆశీర్వదించారు.

ఇబ్బందులు లేకుండా బీపీసీఎల్ పైపులైన్లు

- నిర్మాణాలకు అవకాశాలను పరిశీలించాలి
- జేసీ ఆర్.గోపాలకృష్ణ ఆదేశం

విశాలాంధ్ర-ఒంగోలు : తాగునీటి వనరుకు, ప్రజలకు ఇబ్బంది లేకుండా బీపీసీఎల్ పైపులైను నిర్మాణానికి ఉన్న అన్ని అవకాశాలను పరిశీలించాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ సంబంధిత కంపెనీ ప్రతినిధులకు చెప్పారు. కృష్ణపట్నం పోర్టు నుంచి హైదరాబాదుకు వేస్తున్న బీపీసీఎల్ పైపులైను పేర్నమిట్టలోని చెరువులో నుంచి బీపీసీఎల్ ప్రతిపాదించడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఈ అంశంపై బుధవారం ఆయన ప్రకాశం భవనంలో సంతనూతలపాడు ఎమ్మెల్యే బి.ఎన్.విజయ్ కుమార్తో కలిపి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్థానికులు మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగి 194 ఎకరాలలో విస్తరించిన సహజసిద్ధ ఈ చెరువు 25 వేల మందికి తాగునీటితోపాటు సాగునీటి అవసరాలు కూడా తీర్చుతున్నట్లు చెప్పారు. తాగునీటి వనరుల గుండా ఇలాంటి పైపులైన్లు వేయడం చట్టవిరుద్ధమని అన్నారు. పైగా చెరువు చుట్టు పక్కల ప్రాంతాలను నివాస స్థలాలుగా ప్రభుత్వం గుర్తించిందని, ఈ ప్రాంతంలో నుంచి పైపులైను వేయడం చట్టపరంగా, పర్యావరణ పరంగానూ సరికాదని అన్నారు. ఒంగోలు నగరం విస్తరిస్తున్నందున భవిష్యత్తు తాగునీటి అవసరాలకోసం ఈ చెరువును సమ్మర్ స్టోరేజీ ట్యాంకుగా మార్చుకోవడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయని వారు తెలిపారు. స్థానిక పరిస్థితులను, పర్యావరణ, చట్టపరమైన నిబంధనలను పరిగణనలోకి తీసుకుని ఈ చెరువుగుండా పైపులైను వేయకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించేందుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టరు వారు కోరారు. ఎం.ఎల్.ఏ. మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది కలుగకుండా, బి.పి.సి.ఎల్. పైపులైనుకు ఆటంకం లేకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ ను కోరారు. తాగునీటి వనరులకు నష్టం కలుగకుండా చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. ప్రజలలో ఉన్న ఆందోళనను పరిగణనలోకి తీసుకుని వాటిని నివృత్తి చేయాలని బి.పి.సి.ఎల్. ప్రతినిధులకు సూచించారు. బి.పి.సి.ఎల్. ప్రతినిధులు మాట్లాడుతూ చెరువు బెడ్ లెవెల్ నుంచి 10 - 15 మీటర్ల లోతులో ఈ పైపులైను వేస్తామని చెప్పారు. అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపడతామని వివరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల అభ్యంతరాలు, భవిష్యత్తు అవసరాలు, చట్ట నిబంధనలను పరిగణనలోకి తీసుకుని చెరువులో నుంచి పైపులైను వేసే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని బి.పి.పి.ఎల్. ప్రతినిధులకు స్పష్టం చేశారు. అసలు చెరువునే తాకకుండా ప్రత్యామ్నాయ మార్గంలో పైపులైను వేసేలా దృష్టి సారించాలని ఆయన చెప్పారు. ఈ దిశగా బి.పి.సి.ఎల్. వద్ద ఉన్న ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఒంగోలు కార్పొరేషన్ పరిధిలోని కొంత భూమి నుంచి, కార్పొరేషన్ వెలుపల ఉన్న కొంత భూమిలో నుంచి పైపులైను వెళ్లినా ప్రజలలో అభ్యంతరాలు వ్యక్తమవుతాయన్నారు. ఈ సమావేశంలో ఒంగోలు ఆర్.డి.ఓ. లక్ష్మీ ప్రసన్న, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు

విశాలాంధ్ర-టంగుటూరు : శాఖ గ్రంథాలయం టంగుటూరులో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ బుధవారం గ్రంథాలయ నిర్వహకులు గుమ్మడి వర్ధన రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టంగుటూరు మాజీ సర్పంచ్ బెల్లం జయంత్ బాబు మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, ఎంఈఓ తస్నీరు బాలాజీ టంగుటూరి సర్పంచ్ మద్దిరాల మమత టిడిపి మండల అధ్యక్షులు కామని విజయకుమార్ బెజవాడ వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఇన్కమ్ టాక్స్ కమిషనర్ కురుగుంట్ల సెల్వన్ రాజ్ ఐఆర్ఎస్, లిటిల్ ఏంజెల్స్ స్కూల్ కరస్పాండెంట్ టీ భారతి శాతవాహన హై స్కూల్ కరస్పాండెంట్ అరుణ పాల్గొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

బంగారు బాల్యాన్ని సాధిద్దాం

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : చేయి చేయి కలుపుదాం బంగారు బాల్యాన్ని సాధిద్దామని యర్రగొండపాలెం ఎంఇఓ పి.ఆంజనేయులు అన్నారు. బుధవారం యర్రగొండపాలెంలోని కేజీబీవి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రమాదేవి, తిరుమల దేవి అధ్యక్షతన జరిగిన బంగారు బాల్యం కార్యక్రమంలో భాగంగా "చేయి చేయి కలుపుదాం బంగారు బాల్యం సాధిద్దాం" ముగింపు కార్యక్రమానికి ఎంఇఓ ఆంజనేయులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బడి బయట బాలలు లేని సమాజం కోసం, అనాథలు, అభాగ్యులు, పేద పిల్లలకు సేవచేసే దిశగా అడుగులు ముందుకు వేద్దామని కోరారు. అధికారులకు, ఉపాధ్యాయులకు దన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

ఎస్సై సంపత్ కుమార్

విశాలాంధ్ర-పుల్లలచెరువు : సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగిఉండాలని ఎస్సై సంపత్ కుమార్ అన్నారు.పుల్లల చెరువు జడ్పి హై స్కూలులోని విద్యార్థినీ, విద్యార్థులకు సైబర్ క్రైమ్,రోడ్డు భద్రత నియమాల గురించి బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై సంపత్ కుమార్ మాట్లాడుతూ సెల్ ఫోన్‌లో వచ్చే లోన్ యాప్‌ల జోలికి పోవద్దని హెచ్చరించారు. యాప్‌లలో ఇచ్చే లోన్‌లకు ఆశపడితే మన బ్యాంక్ ఖాతాల్లో ఉన్న డబ్బులను సైబర్ నేరగాళ్లు మింగేస్తున్నారని ఆయన తెలిపారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-కురిచేడు : స్థానిక సచివాలయం-1 కార్యాలయంలో బుధవారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమం గ్రామ సర్పంచి కేసనపల్లి కృష్ణయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మండల విద్యాశాఖ అధికారి వస్త్రం నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజూ పుస్తకమును చదవటం ఒక అలవాటుగా మార్చుకోవాలని గ్రంథాలయాలలో అనేక రకముల పుస్తకాలు ఉంటాయి ఆ పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. జడ్పిటిసి నాగిరెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయం యొక్క నూతన భవనము ఏర్పాటుకు సహకరిస్తానని త్వరలో సంబంధిత అధికారులు కలిసి భవనం ఏర్పాటు గురించి మాట్లాడతానని చెప్పారు. అనంతరం పోటీలో గెలుపు పొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందించడం జరిగింది ఈ కార్యక్రమం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు వివి రమణ రావు జోన్ అధ్యక్షులు జెబీ రామారావు లయన్స్ సభ్యులు జి.నాగరాజు ఎస్వీఎస్ గుప్తా పీవీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పాఠశాలలను కలెక్టర్ తనిఖీ

విశాలాంధ్ర - చెరుకుపల్లి : పాఠశాలల నిర్వహణ సరిగా ఉండాలని,విద్యార్థులు చక్కగా చదువుకునే అవకాశాలు కల్పించాలని కలెక్టర్ జె.వెంకట మురళి చెప్పారు. మండలంలోని చెరుకుపల్లి, గుల్లపల్లి, కావూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు,బాపట్ల పట్టణంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.చెరుకుపల్లి మండలంలో చెరుకుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. ప్రధానోపాధ్యాయులు కె.లక్ష్మీనారాయణను ఆ పాఠశాలకు సంబంధించి టీచింగ్,నాన్ టీచింగ్ స్టాఫ్ వివరాలు,పేరెంట్ మీటింగ్ నిర్వహణ,పాఠశాల క్రీడా ప్రాంగణం వివరాలు, ఆ ప్రాంగణం వ్యాసార్థం, పాఠశాల కాంపౌండ్ వాల్ పడిపోవుటకు గల కారణాలు, పునఃనిర్మాణానికి తీసుకున్న చర్యలు,టాయిలెట్ల పరిశీలన వాటి నిర్వహణ,మధ్యాహ్న భోజనానికి సంబంధించి వంట గది పరిశీలన,తరగతి గదుల పరిశీలన, విద్యార్థుల సామర్థ్యం పరిశీలించి ప్రధానోపాధ్యాయులకు పరిసరాల పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.తదుపరి చెరుకుపల్లి మండలం గుల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి ఆ పాఠశాల నిర్వహణపై కలెక్టర్ ఆరా తీశారు.టీచింగ్,నాన్ టీచింగ్ సిబ్బంది యొక్క వివరాలు,పాఠశాల యొక్క ల్యాబ్ సందర్శన,ల్యాబ్ లోని పరికరాల వివరాలు వాటి యొక్క పనితీరు ల్యాబ్ యొక్క ఉద్దేశం, వినియోగంపై ఉపాధ్యాయులకు సూచన చేశారు.వంటగది, డైనింగ్ హాల్,కంప్యూటర్ రూమ్,తరగతి గదుల పరిశీలన,పరిసరాల పరిశీలన, ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు గదుల పరిశీలించారు.కావూరి ఉన్నత పాఠశాల సందర్శించి టీచింగ్,నాన్ టీచింగ్ సిబ్బంది యొక్క వివరాలు ఆయా తరగతులలో విద్యార్థుల సంఖ్య,పాఠశాల పనితీరు, వంటగదిని పరిశీలించారు. టాయిలెట్ల పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. తల్లిదండ్రుల సమావేశాల నిర్వహణపై పాఠశాల ప్రధానోపాధ్యాయుని వివరాలు అడిగి తెలుసుకున్నారు.బాపట్ల, పురపాలక సంఘ ఉన్నత పాఠశాలను సందర్శించి, ఆటస్థల పరిశీలన, విస్తీర్ణం, క్రొత్తగా నిర్మాణం చేపట్టిన భవన వివరాలపై ఆరా తీశారు. భవనం త్వరగా పూర్తి చేయడానికి గుత్తేదారుడికి ఆదేశాలు ఇవ్వాలని సూచించారు.ఆయనతో పాటు జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్,ఇన్‌ఛార్జ్ జిల్లా విద్య అధికారి చీరాల ఉప విద్యా అధికారి ఎ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

26న ధర్నాను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - రేపల్లె : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ సూత్రాలకు భిన్నంగా ప్రాథమిక హక్కులకు,పౌరుల స్వేచ్ఛా స్వాతంత్రాలకు, ఫెడరల్ స్ఫూర్తికి, లౌకికతత్వానికి హాని కలిగించే విధంగా వ్యవహరిస్తుందని ఎఐటీయూసీ వేమూరు నియోజకవర్గ అధ్యక్షులు బండారు శ్రీనివాసరావు, సీఐటీయూ మండల కార్యదర్శి జి. సుధాకర్‌లు ఆరోపించారు. భట్టిప్రోలులోని ఎఐటీయూసీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక,కర్షక విధానాలను నిరసిస్తూ ఈ నెల26న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరగనున్న మహాధర్నాలో రైతులు, కౌలురైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పట్టణ పేదలు,కార్మికులు, మహిళలు, పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని శ్రీనివాస రావు, సుధాకర్‌లు పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగం దేశ ప్రజలందరికీ కుల,మత,ప్రాంతీయ ఆర్థిక స్థోమతులతో నిమిత్తం లేకుండా స్వాతంత్ర ఫలాలు అందాలని, ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని,దేశ సహజ వనరులు,సంపద ప్రజలందరికీ ఉపయోగపడాలని ఆకాంక్షించిందని, కాని ఇందుకు విరుద్ధంగా కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం వ్యవహరిస్తుందని వారు విమర్శించారు. స్వామినాధన్ రైతు కమీషన్ సిఫార్సు చేసిన విధంగా సమగ్ర పంటల ఉత్పత్తి వ్యయానికి 50శాతం కలిపి చట్టబద్ధ ఎమ్.ఎస్.పిలను ప్రకటించాలని, ధరల పతనం,రుణభారాలతో లక్షలాది మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడిన నేపథ్యంలో ఒక్క పర్యాయం పంట రుణాల బకాయిలను మాఫీ చేయాలని, రైతులు, వ్యవసాయ కార్మికులకు నెలకు రూ. 10 వేలు పెన్షన్ సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో చేనేత కార్మిక సంఘాల నాయకులు గొట్టుముక్కల బాలాజీ, మురుగుడు సత్యనారాయణ,కొడాలి రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర - రేపల్లె : మండలంలోని నల్లూరుపాలెం గ్రామంలో గల శాఖా గ్రంధాలయంలో ఈనెల 14 నుండి ప్రారంభమైన 57వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిసాయి.ఈ సందర్భంగా గ్రంధాలయ భవనంలో జరిగిన కార్యక్రమంలో గ్రంధాలయ అధి కారి శివకృష్ణ పర్యవేక్షణలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఎన్. స్వర్ణలత,విశిష్ట అతిథులుగా ఎమ్మార్పీఎస్ నాయకులు జె.మాణిక్యరావు,దున్న రాబర్ట్ కోటేశ్వరరావు, ఇమ్మానియేల్,గ్రంధాలయ సిబ్బంది పాఠకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్వర్ణలత మాట్లాడుతూ ప్రతి ఒక్కరు గ్రంధాలయానికి వచ్చి చదువుకోవాలని,ఏ గ్రంధాలయంలో లేని విధంగా ఎక్కువ రోజులు ప్రతిరోజు గ్రంధాలయానికి వచ్చి చదువుకుంటున్న వారికి స్కాలర్ షిప్పులు ఇస్తున్నామన్నారు. గ్రంధాలయ అధికారి పి. శివకృష్ణ ఈ సౌకర్యం కల్పించారని గ్రంథాలయ అధికారిని అభినందించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులను అందజేశారు

ముగిసిన నాటుబండిపూటి ఎడ్ల పోటీలు

విశాలాంధ్ర - చెరుకుపల్లి : ఆరుంబాక గ్రామంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి నాటు బండి పూటి ఎడ్ల పోటీలు నాగరికతను చాటి చెప్పేలా ఘనంగా జరిగాయి.శ్రీ పోలేరమ్మ, నెల్లెమ్మ,అంకమ్మ తల్లి ఆశీస్సులతో రెండు రోజులు పాటు రైతు నిర్వాహకులు పోటీలు నిర్వహించారు.న్యూ జూనియర్స్ విభాగంలో 200 కేజీలు,సీనియర్స్ విభాగంలో 250 కేజీలకు పోటీలు నిర్వహించగా న్యూ జూనియర్స్ విభాగంలో అమృతలూరు మండలం పెద్దపూడి గ్రామానికి చెందిన అలహరి కృష్ణయ్య ఎడ్లు ప్రధమ స్థానం,చినగంజాం మండలం చుపిరాల గ్రామానికి చెందిన చెరుకూరి సందినా ఎడ్లు ద్వితీయ స్థానం, చెరుకుపల్లి గ్రామానికి చెందిన జజ్జర ఎలమందల వెంకట గోపాలకృష్ణకు చెందిన ఎడ్లు తృతీయ స్థానం సాధించాయి.సీనియర్స్ విభాగంలో పత్తిపాడు మండలం పమిడి అంజయ్య చౌదరి ఎడ్లు ప్రధమ స్థానం,కృష్ణాజిల్లా చిన్న పులిపాక గ్రామానికి చెందిన ఆర్.వి.ఎస్ బుల్స్ ద్వితీయ,తృతీయ స్థానాలను గెలుపొందడం జరిగింది.అదేవిధంగా జూనియర్స్ విభాగంలో 8 జతలను, సీనియర్స్ విభాగంలో ఆరు జతల ఎడ్లను విజేతలుగా ప్రకటించి బహుమతులు అందజేయడం జరిగింది.కమిటీ సభ్యులు కొఠారి వరప్రసాద్ పర్యవేక్షణలో రిఫరల్‌గా రాధాకృష్ణమూర్తి,రమేష్‌లు వ్యవహరించారు. మేలైన పశువులను తయారు చేసేందుకు ఇటువంటి పోటీలకు ప్రభుత్వం నుండి కూడా సహాయ సహకారాలు అందించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్క సభ్యులను,అభినందించి సత్కరించడం స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

ఉద్యోగ మేళాలో 23 మంది ఎంపిక

విశాలాంధ్ర-పర్చూరు:నిరుద్యోగ యువత 23 మందికి ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.ప్రణయ్ తెలిపారు. స్థానిక ఎస్‌కేపీఆర్ డిగ్రీ కళాశాలలో బుధవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగమేళా నిర్వహించారు. ఈ సందరగా ఆయన మాట్లాడుతూ మేళాలో ప్రముఖ కంపెనీలు పాల్గొనగా 48 మందికి 23 ఎంపిక అయ్యారని తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ ఒగ్గిశెట్టి నరసింహం మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగే జాబ్ మేళాలను, శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగార్జున, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి బి.శ్రీనివాస్, స్కిల్ హబ్ సమన్వయకర్త పి.వినోద్ కుమార్, జేసీఓ కళ్యాణి ఉన్నారు.

వైభవంగా స్వామివారి పునఃప్రతిష్ఠా మహోత్సవం

విశాలాంధ్ర-పర్చూరు: మండలంలోని నూతలపాడు సమీపంలో వేంచేసియున్న శ్రీ అభినవ శిలామయ శ్రీఅభయాంజనేయస్వామివారి పునఃప్రతిష్ఠా మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. భక్తులు స్వామివారి ప్రత్యేక పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ వారు భక్తులకు అసౌకర్యం కలుగకుండ ఏర్పాట్లు చేశారు. అన్నదాన కార్యక్రమం జరిగింది.

ఘనంగా బాలల హక్కుల దినోత్సవం

విశాలాంధ్ర - యద్దనపూడి : మండలంలోని జాగర్లమూడి గ్రామంలో ఏ.ఎస్ హైస్కూల్‌లో బాలల హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సూపర్‌వైజర్ సిహెచ్ సుజాత మాట్లాడుతూ పిల్లలు తమ భావాలను,సమాచారాన్ని పంచుకోవడాన్ని తల్లిదండ్రులు వారికి ప్రోత్సాహాన్ని అందించాలని,పిల్లలు స్వతంత్రులై తమంతట తామే ఏ కార్యక్రమంలోనైనా పాల్గొనాలన్నారు. కరోనా అనంతరం విపరీతమైన మార్పులు వస్తున్నాయి.కొంతమంది పిల్లలు ఉపాధ్యాయులు సిబ్బంది చెప్పిన మాటలు కూడా వినే పరిస్థితిలో లేరని,తల్లి దండ్రులు, ఉపాధ్యాయ సిబ్బంది సమిష్టిగా కృషి చేస్తే పిల్లలో మార్పుకు శ్రీకారం చుట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అంజయ్య,మధుబాబు, అంగన్‌వాడీలు నాగరాజా,టీ.త్రివేణి,పి. సునీత,కే. సుజాతమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రధానం

విశాలాంధ్ర - వేమూరు : మండల కేంద్రమైన వేమూరు శాఖా గ్రంధాలయంలో జరిగిన 57వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాల్లో వివిధ ఆటల పోటీల్లో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు బుధవారం బహుమతి ప్రధాన కార్యక్రమం జరిగింది.మండల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిషోర్ చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేశారు.కార్యక్రమంలో రిటైర్డ్ సూపరిండెంటెంట్ వెంకట్రామయ్య,వేమూరు పంచాయతీ శానిటరీ ఇనిస్పెక్టర్ చంద్రపాల్,దివ్యాంగుల వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు దాసరి బసవయ్య, చైల్డ్ రైట్స్ ఫౌండేషన్ సభ్యురాలు కొండ కీర్తన,పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ప్రకాష్, గ్రంధాలయా అధికారి కంచర్ల శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సెల్ ఫోన్ వద్దు పుస్తకమే ముద్దు

విశాలాంధ్ర - చీరాల : సెల్ ఫోన్ వద్దు పుస్తకం ముద్దు అని పలువురు వక్తలు పేర్కొన్నారు. చీరాల శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వారోత్సవాలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ పుస్తకాలు చదవడం ద్వారానే విజ్ఞానం పెరుగుతుందని విద్యార్థులు యువతీ యువకులు గ్రంథాలయాలను వినియోగించుకుని తమ జ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. అనంతరం డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన సామూహిక స్వీయ పఠనము కార్యక్రమము నిర్వహించి వారోత్సవాలలో నిర్వహించిన పోటీలకు బహుమతులు అందజేశారు. బత్తుల బ్రహ్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ సత్రం మల్లేశ్వరరావు, సర్వసెట్టి సుబ్బరామయ్య, మునీరుల్లా ఖాన్, చుండూరి కృష్ణమూర్తి, మహిళా మండలి సభ్యులు రూపాదేవి చంద్రమౌళి, కిషోరు తదితరులు పాల్గొన్నారు.

సంతాన సాఫల్య శిబిరం

విశాలాంధ్ర - చీరాల : సంతాన లేమి నుండి మాతృత్వం దిశగా వెళ్లాలనుకునే భార్య భర్తలు చీరాల రోటరీ సామాజిక భవనంలో ఆదివారం నిర్వహించే ఉచిత సంతాన సాఫల్య శిబిరంలో పాల్గొనాలని చందలూరి బాల వెంకటేశ్వరరావు అన్నారు. 8105076638 నంబర్ని సంప్రదించాలని నక్కల సురేష్, పోలుదాసు రామకృష్ణ కోరారు.

26లోపు సాంద్రతపై అభ్యంతరాలు తెలపండి

విశాలాంధ్ర - రేపల్లె : టౌన్ ప్లానింగ్ అండ్ కంట్రీ ప్లానింగ్ మంగళగిరి వారి ఆదేశాల మేరకు రేపల్లె మున్సిపాలిటీలో రోడ్లు వెడల్పు తక్కువగా ఉన్న జనసాంద్రత తదితర అంశాలపై పట్టణ ప్రజలు తెలియ పరచాలని కమిషనర్ సాంబశివరావు తెలిపారు. నిర్మాణాల సాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సంబంధిత భవన యజమానులు, భవన నిర్మాణాలు, సులభంగా పొందేందుకు వీలుగా సంబంధిత ప్రాంతాలకు సర్కులేషన్ పాట్రన్స్ తయారుచేసి సంబంధిత కాంపిటెంట్ అథారిటీ వారి నుండి ఆమోదం పొందేందుకు అభ్యంతరాలు ప్రజల నుండి స్వీకరించేందుకు ఈనెల 26వ తేదీలోగా సచివాలయ లేదా మున్సిపల్ కార్యాలయ పనివేళల్లో రాతపూర్వకంగా తెలియచేయాలని తెలిపారు.

మత్స్యకార దినోత్సవ వేడుకల్లో పాల్గొనాలి

విశాలాంధ్ర - నిజాంపట్నం : ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా గురువారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం నందు జరుగనున్న వేడుకల కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని నియోజకవర్గ పరిధిలోని మత్స్యకారులు, మత్స్యకార నాయకులు, బోటు యూనియన్ సభ్యులు తప్పక పాల్గొని విజయవంతం చేయాలని టీడీపీ సీనియర్ నాయకులు, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ బొమ్మిడి రామకృష్ణ అన్నారు.

23న ఎన్.ఎం.ఎం.ఎస్ గ్రాండ్ పరీక్ష

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ఈ నెల 23వ తేదీన చందోలులోని నీలి బంగారయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాల్గో గ్రాండ్ ఎన్.ఎం.ఎం.ఎస్ పరీక్షను ఎస్టీయూ నిజాంపట్నం మండల శాఖ నిర్వహిస్తుందని జిల్లా అధ్యక్షులు బడుగు శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఎంతో ఉపకరిస్తుందని పేద మధ్య తరగతి తల్లిదండ్రులకు, ఆర్థికంగా వెనుకబడిన బిడ్డల బంగారు భవిష్యత్తు కోసం కేంద్ర ప్రభుత్వం ఆర్థిక చేయూతనిస్తూ ప్రవేశపెట్టిన పథకమని పేర్కొన్నారు. పరీక్ష రాసే విద్యార్థులు ఈనెల 22వ తేదీ లోపు వారి యొక్క పేర్లను ఎన్.వెంకట సుబ్బారావుకి 8466858723 కి ఫోన్ చేసి ముందుగా నమోదు చేసుకోవాలని తెలిపారు.

పీఎంఏవై లబ్ధిదారులు ఇళ్ళ నిర్మాణాలను చేపట్టాలి

విశాలాంధ్ర - నిజాంపట్నం : ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని ఎంపీడీవో ఎన్.నాగలక్ష్మి సూచించారు. మండలంలోని బొర్రావారిపాలెం, కూచినపూడి సచివాలయాల్లో బుధవారం హౌసింగ్ ఏఈ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఆవాస్ దివస్, ఆవాస్ సప్తాహ్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ పథకంపై లబ్ధిదారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంపీడీవో హాజరై మాట్లాడారు. సర్పంచ్ కేసన నాగ ముత్యాలమ్మ సోమయ్య, బొర్రా సాంబశివరావు, కేసన మురళి, నల్లపాటి ఎల్లయ్య, సెక్రటరీలు స్రవంతి, వీరాస్వామి, వీఆర్ఓ సుభాని, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

26న మహాధర్నాను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతాంగ, కార్మిక, వ్యతిరేక విధానాలకి నిరసనగా దేశవ్యాప్తంగా రైతు సంఘాలు, కార్మిక సంఘాలు ఐక్యంగా ఈ నెల 26వ తేదీన పట్టణంలోని చీలురోడ్డు సెంటర్ చివుకుల శేషశాస్త్రి స్థూపం వద్ద తలపెట్టిన మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్ తెలిపారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపి కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలన్నారు. అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్నం భోజనం, వెలుగు, నేషనల్ హెల్త్ మిషన్, సమగ్ర శిక్షణ, ఉపాధి హామీ, తదితర స్కీం వర్కర్లను ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం పెన్షన్ గ్రాడ్యుటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేసి రెగ్యులర్ చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రవేకరణ నిలిపివేసి నేషనల్ మోనిటైజేషన్ విధానం రద్దుచేసి చేతివృత్తుదారుల సమస్యలు పరిష్కరించాలన్నారు. రైతాంగ సమస్యలపై, కార్మిక సమస్యలపై జరిగే మహాధర్నాలో జిల్లా నుంచి రైతులు కౌలు రైతులు పెద్ద ఎత్తున పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెల్లి భాగ్య శ్రీధర్ మాట్లాడుతూ రైతాంగం, కార్మికులు, డిమాండ్స్ పై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను ఆయన వ్యతిరేకించారు. కార్మికులకు కనీస వేతనం నెలకి రూ.26000 నిర్ణయించి అమలు చేయాలన్నారు. రైతుల ఉత్పత్తులకు ఉత్పత్తి ఖర్చు కుటుంబ శ్రమ విలువకు మరో 50 శాతం కలిపి కనీస మద్దతు ధర నిర్ణయించాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు రుణ సౌకర్యం అమలు చేసి వ్యవసాయ కార్మికులకు రైతులకు నెలకు పదివేల రూపాయల పెన్షన్ ఇవ్వాలన్నారు. అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మేకల ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలు దేశంలో రాష్ట్రంలో వ్యవసాయ కూలీలు తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దీని వలన ఉపాధి రంగం కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. నల్లమడ రైతు కూలీ సంఘం అధ్యక్షులు కారుమంచి విజయ్ కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కు ప్రకారం సమాన పనికి సమాన వేతనం పాటించకుండా తక్కువ వేతనాలతో పనులు చేయించుకుంటూ 8 గంటలు చేయాల్సిన పనిని కూడా 12 గంటలకు పెంచి కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ఎమ్మెస్ స్వామినాథన్ సిఫార్సు ప్రకారం రైతులకి సి ప్లస్ టు ప్లస్ 50 శాతం సూత్రాన్ని అమలు చేయడం లేదన్నారు. లక్షలాదిమంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కర్షక కార్మిక వ్యతిరేక విధానాల చట్టాల కి నిరసనగా జిల్లాలోని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, ఏఐటీయూసీ, అఖిలభారత రైతాంగ సంఘం, నల్లమడ రైతు సంఘాలా ఆధ్వర్యంలో సంయుక్తంగా 26వ తేదీన జరుగు మహాధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

బాలికపై అత్యాచారం ఘటనలో నిందితుడికి 20 ఏళ్లు జైలు

విశాలాంధ్ర - బాపట్ల : చిన్నగంజాం మండలం సంతరావూరు గ్రామంలో చదువుకుంటున్న ఆరు ఏళ్ల వయస్సు ఉన్న మైనర్ బాలికపై 2018 ఏడాదిలో పాఠశాల వద్ద ఆడుకుంటుండగా అదే గ్రామానికి చెందిన దుద్దు చిన్నబ్బాయి బాలికకు మాయ మాటలు చెప్పి స్కూలు వెనక ఉన్న తుమ్మ చెట్లలోనికి తీసుకొని వెళ్ళి అత్యాచారం చేస్తుండగా అదే పాఠశాలలో చదువుకుంటున్న బాలుడి చూసి కేకలు వేశాడు. దీంతో నిందితుడు బాలికను వదిలివేసి పరారైయ్యాడు. బాలిక ఇంటికి వెళ్ళి తల్లిదండ్రులకు విషయం చెప్పగా చిన్నగంజాం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. అప్పటి చీరాల డిఎస్పీ వి. శ్రీనివాసరావు దర్యాప్తు ప్రారంభించి మైనర్ బాలికను, ఫిర్యాదిని, ఇతర సాక్షులను విచారించి వాంగ్మూలం నమోదు చేసుకున్నారు. నేరస్థలంను క్షుణ్ణంగా పరిశీలించి నిందితుడిపై మోపబడిన అభియోగాన్ని తగిన సాక్ష్యాధారాలతో నిరూపించి అరెస్ట్ చేసి రిమాండ్కు పంపారు. నేర స్థలంలో, బాధితురాలు, నిందితుడి వద్ద సేకరించిన భౌతిక సాక్ష్యాధారాలను నిపుణుల పరిశీలనకు పంపి నిపుణులు ఇచ్చిన నివేదికను ఇతర సాక్ష్యాధారాలతో పొందుపరిచి సంబంధిత కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. ఈ కేసు ఒంగోలు స్పెషల్ కోర్ట్ ఫోక్సో కోర్టులో విచారణకు రాగ జిల్లా ఎస్పీ తుషార్ డూడి స్వీయ పర్యవేక్షణలో ఇంకొల్లు సర్కిల్ ఇనిస్పెక్టర్ వై.వి రమణయ్య, చిన్నగంజాం సబ్ ఇనిస్పెక్టర్ ఎస్.రమేష్, కోర్టు కానిస్టేబుల్ జి.నాగేశ్వరరావులు సాక్షులు సరైన పద్ధతిలో నిర్భయంగా సాక్ష్యం చెప్పే విధంగా తర్ఫీదు ఇచ్చి, సరైన సమయంలో కోర్టులో హాజరు పరిచారు. స్పెషల్ పిపి.వెంకటేశ్వర్లు కోర్టులో వాదించి నిందితునిపై మోపబడిన నేరాన్ని తగిన సాక్ష్యాధారాలతో నిరూపించారు. ఒంగోలు 7వ ఏ.డి.జె, ఎఫ్.ఏ.సి స్పెషల్ కోర్టు ఫోక్సో కోర్టు న్యాయమూర్తి రాజా వెంకటాద్రి సాక్షులు చెప్పిన సాక్ష్యం, దర్యాప్తు అధికారి సేకరించిన భౌతిక ఆధారాలను పరిగణలోకి తీసుకొని బుధవారం నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ. 10,000 జరిమానా విధిస్తున్నట్లు తీర్పు వెల్లడించారు. బాధితురాలికి ప్రభుత్వం నుండి రూ. 7,00,000 నష్టపరిహారం ప్రకటించారు. కేసు దర్యాప్తు వేగవంతంగా నిర్వహించి, ముద్దాయిని అరెస్ట్ చేసి, భౌతిక సాక్ష్యాధారాలను కోర్టు వారికి సమర్పించి, సమర్థవంతంగా ట్రయిల్ మానిటరింగ్ నిర్వహించి నిందితుడికి జైలు శిక్ష పడేలా చర్యలు తీసుకున్న పోలీస్ అధికారులను, కోర్టు మానిటరింగ్ సిబ్బందిని, పీపీని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

పంటలకు బీమా చేయించుకోవాలి

విశాలాంధ్ర - అద్దంకి : వరి, మొక్కజొన్న, శనగ పంటలు సాగు చేస్తున్న రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ రైతులకు సూచించారు. బుధవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో మాట్లాడుతూ వరికి రూ. 126లు, మొక్కజొన్నకి రూ. 105లు, శనగ పంటకు రూ. 84లు పంటల భీమా చెల్లించాలని తెలిపారు. ఉద్యాన అధికారి దీప్తి మాట్లాడుతూ బిందు, తుంపర సేద్య పరికరాలకు రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర - నిజాంపట్నం : విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకునేందుకు గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని నిజాంపట్నం రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కె.గౌరీ శంకర్, గ్రంథాలయ కమిటీ మెంబర్ కొల్లిపర శ్రీనివాసరావు అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సందర్భంగా బుధవారం నిజాంపట్నం శాఖా గ్రంథాలయంలో బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అధికారిణి ఎస్.విజయలక్ష్మి, గ్రంథాలయ కమిటీ మెంబర్ షేక్ తాజుద్దీన్, పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించండి

గూడూరు శివరామ ప్రసాద్

విశాలాంధ్ర - చీరాల : రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ మాల యువతకు మాల కార్పొరేషన్ ద్వారా న్యాయం చేయాలని, రాష్ట్రంలోని మాలల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి గూడూరు శివరామ ప్రసాద్ అన్నారు. బుధవారం మాల కార్పొరేషన్ చైర్మన్గా పెదపూడి విజయ్ కుమార్ మంగళగిరి మాల కార్పొరేషన్ కార్యాలయంలో చేస్తున్న ప్రమాణ స్వీకార కార్యక్రమంలో గూడూరు శివరామ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయ్ కుమార్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్కి హృదయపూర్వక కృతజ్ఞతలన్నారు. చట్టబద్ధంగా పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు వచ్చేలా కృషి చేస్తానని మాలల నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు అందేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సంఘమిత్ర సేవా సొసైటీ అధ్యక్షులు గుమ్మడి సూర్య ప్రకాష్, వేటపాలెం జనసేన మండల అధ్యక్షులు ఉగ్గిరాల మార్కండేయులు, జనసేన పట్టణ నాయకులు అనుమకొండ కిషోర్ పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, GRANDHE RANGA LAKSHMI DEVI (Old Name), W/o. Grandhe Chandra Sekhara Rao, Resident of Door No.2-259, SBI Road, Yerragondapalem, Prakasam District - 523327, Andhra Pradesh. I have changed my name as GRANDHE RANGA LAKSHMI (New Name) W/o. Grandhe Chandra Sekhara Rao. Hereafter my name is known as GRANDHE RANGA LAKSHMI (New Name) W/o. Grandhe Chandra Sekhara Rao.

పంచాయతీ రికార్డుల నిర్వహణను వేగవంతం చేయాలి

ఎంపీడీవో సుందర రామయ్య

విశాలాంధ్ర-తాళ్లూరు : పంచాయితీరాజ్ మరియు గ్రామీణా భివృద్ధి సంస్థ ఆదేశాల మేరకు గ్రామాలలో పూర్తి స్థాయిలో డిజిటలైజేషన్ చేయాలని ఎంపీడీవో సుందర రామయ్య కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం గ్రామకార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ సుందర రామయ్య మాట్లాడుతూ 2024-25 సంవత్సరంకి నిర్ణయించిన బడిన డిమాండ్ పన్ను పన్ను యేతర డేటా ను సిద్ధంగా ఉంచాలని అసెస్ మెంట్ కోసం ఫిజికల్ రికార్డులను అందుబాటులో ఉంచాలని కోరారు. మిగిలిన అదనపు సమాచార సేకరించాల్సి న అవసరం ఉన్నట్లయితే డిజిటల్ అసిస్టెంట్స్, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్, గ్రామ సర్వేయర్లు ఇతర సచివాలయ సిబ్బందితో బృందాన్ని ఏర్పాటు చేసు కోవాలని చెప్పారు. పంచాయితీల వద్ద అందుబాటులో ఉన్న ఖచ్చితమైన డేటాతో పాటు అదనపు సమచారాన్ని కూడ సేకరించి రికార్డులను నవీకరించాల్సి ఉందని తెలిపారు. లోప రహితంగా కచ్చితమైన డేటాను సేకరించి వెబ్ పోర్టల్లో అప్డేట్ చేయటం పంచాయితీ కార్యదర్శి బాధ్యత అని చెప్పారు. నిబంధనల ప్రకారం ఇంటి యజమాని వివరాలు, సరియైన ధృవ పత్రాల ప్రకారం ఉండేలా చూడాలని, క్షేత్ర స్థాయిలో పొరుగు వారి వివరాలు ఖచ్చితంగా ఉండేలా, ఇంటి పన్ను నిర్ధారణ సక్రమంగా ఉండేలా చూసుకోవాలని కోరారు. డేటా మొత్తం సేకరించి పూర్తి స్థాయిలో పరిశీలన తర్వాత మాత్రమే గ్రామకార్యదర్శి ఆడేటాను భద్రపరచాలని చెప్పారు. ఈఓఆర్డీ, డీఎల్ పి ఓ , డిపిఓ రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలన తర్వాత ఆటో జనరేట్ సర్టిఫికేట్ తో డేటా నిర్ధారించబడుతుందన్నారు. ఈ నెల 30 నాటికి నూరు శాతం డేటా ఎంట్రీ జరిగేలా చూడాలని కోరారు. పంచాయితీలలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ఆధార్ కేంద్రాలను పంచా యితీలలో ఏర్పాటు చేసి ఆధార్ అప్డేట్ చేసుకోవాల్సిన ప్రజలకు , విద్యార్థులకు సమాచారం అందేలా చూడాలని చెప్పారు. ఎన్ పీ సీఎల్ లింక్ కాని వారికి లింక్ చేసి త్వరిత గతిన సేవలు అందించాలని సూచించారు.

సైబర్ నేరాలపై యువత దృష్టి పెట్టాలి

- కొండపి సీఐ సోమశేఖర్

విశాలాంధ్ర-మరిపూడి : సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపై విద్యార్థిని విద్యార్థులు దృష్టి సారించాలని కొండపి సీఐ సోమశేఖర్ అన్నారు. మండల కేంద్రమైన మర్రిపూడి జూనియర్ కళాశాలలో బుధవారం జరిగిన అవగాహన సదస్సులో సిఐ సోమశేఖర్ పాల్గొని మాట్లాడారు. వాహన ప్రమాదాలపై, సోషల్ మీడియాలో వస్తున్న ఫేక్ న్యూస్ లను, సైబర్ నేరాలపై కళాశాల విద్యార్థిని విద్యార్థులకు వివరించారు, వాహనాలపై ప్రయాణించేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలి అన్నారు. సోషల్ మీడియాలో ఎవరైనా అసాంఘిక న్యూస్ ఉపయోగించినప్పుడు పోలీసులు దృష్టికి తీసుకురావాలని కోరారు. సైబర్ నేరాలకు దూరంగా ఉండాలని వాటిని పూర్తిగా నిషేధించాలని కూడా కోరారు, ఈ కార్యక్రమంలో ఎస్సై రమేష్ బాబు, కళాశాల ప్రిన్సిపల్, లెక్చరర్లు తదితరులు ఉన్నారు.

మాల వెల్ఫేర్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయ్‌కుమార్‌

విశాలాంధ్ర-గిద్దలూరు : తాడేపల్లిలో ఏపీ మాల వెల్ఫేర్ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ పెదపూడి విజయ్ కుమార్ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలియపరచిన గిద్దలూరు నియోజక వర్గం జనసేన పార్టీ ఇంఛార్జి బెల్లంకొండ సాయిబాబు, జిల్లా కార్యదర్శి లంకా నరసింహ రావు, బేస్తవారపేట మండల అధ్యక్షుడు ముంతల మధు సుదన్ రెడ్డి, వెంకటేశ్వర్లు, శంకర్ ఉన్నారు

బహిరంగ మలమూత్ర విసర్జన నిషేధం

విశాలాంధ్ర-చీమకుర్తి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు చీమకుర్తి పురపాలక సంఘంలో బహిరంగ మలమూత్ర విసర్జన చేయడం నిషేధించడమైంది. పురపాలక సంఘ పరిధిలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు స్వయం సహాయక సంఘం మహిళా సంఘాలు తో మీటింగ్ ఏర్పాటు చేసి బహిరంగ మలమూత్ర విసర్జన చేయుట నేరమని ,బహిరంగ మల విసర్జన చేసినచో రూ. 50,మలవిసర్జన చేస్తే రూ.30 రూపాయలు జరిమానాను నిర్ణయించారని చీమకుర్తి కమిషనర్ వై.రామకృష్ణ తెలిపారు.

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి: తహసీల్దార్

విశాలాంధ్ర-తాళ్లూరు : అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సంజీవ రావు కోరారు. వికే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ప్రిన్సిపాల్ కొండపల్లి ఆంజనేయులు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తహసీల్దార్ సంజీవ రావు మాట్లాడుతూ ప్రజా స్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని 18 సంవత్సరాల నిండిన వెంటను తమ ఓటును ఆన్ లైన్ లో లేదా బీఎల్.ఓ ల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటు హక్కు ప్రాధాన్యతపై కాలేజి విద్యార్థులకు అవగాహన కల్పించారు. లెక్చరర్ గురవయ్యలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి: సీఈవో

విశాలాంధ్ర-కొండపి : గ్రామాల్లో అభివృద్ధికి ఎంపీడీవోలు ప్రణాళిక బద్ధంగా అధికారులతో కలిసి సమన్వయం చేసుకొని కృషి చేయాలని జిల్లా సీఈవో బి చిరంజీవి సూచించారు. కొండపులోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జిల్లా సీఈవో చిరంజీవి నియోజకవర్గంలోని పలు మండలాల ఎంపీడీవోలతో సమావేశం నిర్వహించారు. కొండపి నియోజకవర్గ. 15వ ఆర్థిక సంఘం నిధుల జమా ఖర్చుల వివరాలు గురించి చర్చించారు. అదేవిధంగా బీసీ కాలనీలో సిసి రోడ్డు పరిశీలించడం జరిగింది కొండపి ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య ఉద్దేశంగా మాట్లాడిన భాగం సర్వే గురించి బయోమెట్రిక్ తదితర విషయాలు ఎంపీడీవోలు తెలియజేశారు. కార్యక్రమంలో ముందుగా పల్లె పండుగ లో భాగం గా బీసీ కాలని లో సీసీ రోడ్ లు పరిశీలించి సంతృప్తి చెందారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర-బేస్తవారిపేట : స్థానిక కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయంలో బుధ వారం ఎస్సై రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థినులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కంభం సీఐ మల్లికార్జున రావు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొందరు కేటుగాళ్లు దొంగ వెబ్ సైట్లు ప్రారంభించి ఫేస్ బుక్, ఇన్ స్టాగ్రామ్, వాట్సాప్ గ్రూపులలో లింకులను ఓపెన్ చేసి నేరాలకు పాల్పడుతున్నారని అలాంటి వారి పట్ల జాగ్రత్త గా ఉండాలన్నారు. ఇటీవల కాలంలో ఈ సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ప్రధానంగా ఉద్యోగస్తులు, విద్యార్థులు ఈ సైబర్ నేరాలకు గురవుతున్నారని, వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మత్తు పదార్థాలు, మహిళలపై జరుగుతున్న క్రైమ్స్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ సత్యవతి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పిచ్చయ్యకు సన్మానం

విశాలాంధ్ర-గిద్దలూరు : మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పొదిలికొండ పల్లెలో హిందీ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న డాక్టర్ మెర్రి. పిచ్చయ్యకు ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ముఖ్యమంత్రి మరియు విద్యాశాఖ మంత్రిల చేతుల మీదుగా ప్రధానం చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని హిందీ స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ షేక్ గౌస్ బాషా అధ్యక్షతన బుధవారం సాయంత్రం 5 గంటలకు ఆత్మీయ అభినందన సభ జరిగింది. కాంప్లెక్స్ చైర్మన్ మరియు ఉపాధ్యాయ సిబ్బంది అవార్డు గ్రహీత డాక్టర్ పిచ్చయ్య యొక్క సేవలను ప్రశంసించి దుశ్శాలువ, పూల మాలతో ఘన సన్మానం చేశారు. పిచ్చయ్య మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, యడవల్లి తన జీవితంలో మర్చిపోలేని మైలురాయని తాను ఈ పాఠశాలలో చదువు కోవడమే కాకుండా ఇదే పాఠశాలలో గతంలో ఉపాధ్యాయులుగా పని చేశానన్నారు.

ఈ కార్యక్రమంలో హిందీ కాంప్లెక్స్ ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొని ఘన సత్కారం చేశారు.

ముగిసిన గ్రంథాలయ వార్షికోత్సవాలు

విశాలాంధ్ర-దర్శి : దర్శి గ్రంథాలయ శాఖలో బుధవారము 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా చివరి రోజు ఏడవ రోజున ఈ వారోత్సవాలలో వివిధ రకాల పోటీలు నిర్వహించడం జరిగింది.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు చిత్రలేఖనం డాన్స్ క్విజ్ వక్తృత్వం ముగ్గుల పోటీలు కథల పోటీలు నిర్వ హించి ఆయా పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఈ రోజున బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో అభినందన సభ ఏర్పాటు చేసి విద్యార్థులకు బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్పీహెచ్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్.కె కాలేశావలి, ఏడియన్ న్యూస్ అధినేత జూపల్లి కోటేశ్వరరావు, అట్లూరి రామారావు ఎస్ జి టి, సంఘ సేవకులు జీవిరత్నం విచ్చేసి విద్యార్థులకు బహుమతులు అందజేయడం జరిగింది. గ్రంథపాలకురాలు వి విజయ కుమారి బీడీఎల్ బి కోటయ్య వై పద్మావతి చెంచులింగం ఆర్ సుధాకర్ బోషణం,హై స్కూల్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

హైస్కూల్ అడ్మిషన్ సంఘ సేవకుడు జీవి రత్నం ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు జూపల్లి కోటేశ్వరరావు గ్రంథాల సిబ్బంది శాలువాలు కప్పి పూలదండలు వేసి ఘనంగా సత్కరించారు.

సలకలవీడులో 'పొలం పిలుస్తోంది'

విశాలాంధ్ర - బేస్తవారిపేట : మండలంలోని సలకలవీడు, కలగొట్ల గ్రామాలలో బుధవారం మండల వ్యవసాయాధికారిణి జక్కం మెర్సీ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు 2024 రబీ సీజన్ లో వేసిన పంటలకు ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన పథకం కింద పంటల భీమా ప్రీమియంను ఐసీఐసీఐ లాంబార్డ్ ఇన్సూరెన్స్ కంపెనీకి బేస్తవారి పేట సీఎస్ఈ సెంటర్లలో చెల్లించి భీమా చేయించుకోవాలని తెలిపారు. వ్యవసాయ విస్తరణాధికారి నారా ఆది గణేష్, వ్యవసాయ సహాయకులు తమ్మినేని రమణా రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అసత్య పోస్టులు పెడితే చర్యలు తీసుకోవాలి

వైసీపీ నాయకులు వెంకటరెడ్డి

విశాలాంధ్ర-దర్శి : దర్శి నియోజకవర్గంలో తెలుగుదేశం జనసేన పార్టీలకు చెందిన సానుభూతిపరులు వైసీపీ నాయకులు పై కార్యకర్తలపై అసభ్యకరంగా పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్లో వైసిపి నాయకులు ఫిర్యాదు చేశారు.సోషల్ మీడియా వేదికగా దాడులకు పాల్పడి భయభ్రాంతుల గురిచేయాలని టీడీపీ జనసేన శ్రేణులు పథక రచన చేస్తున్నాయని వారిపై తమ చర్యలు తీసుకో తీసుకొని ఎడల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆందోళన కార్యక్రమంలో ఉధృతం చేస్తామని ఫిర్యాదులో పేర్కొన్నారు . వెన్నపూస వెంకటరెడ్డి కె.వి.రెడ్డి, బండి గోపాల్, మాజీ ఎంపి విత్తడి దేవదానం,వైస్ ఎంపీపీ సొమ్ము దుర్గారెడ్డి కుమ్మిత అంజిరెడ్డి, నరసింహారెడ్డి ఇరుగుల శ్రీనివాస్ రెడ్డి, అంకాల నాగయ్య, రవి, పలువురు వైసిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

చిల్ల చెట్లు తొలగింపు

విశాలాంధ్ర-మర్రిపూడి : మండల కేంద్రమైన మర్రిపూడి ఎస్సీ కాలనీ చర్చి దగ్గర రహదారికి ఇరువైపులా చిల్ల చెట్లను బుధవారం పంచాయతీ శాఖ అధికారులు జెసిబితో తొలగించారు. గ్రామ పెద్దలు విన్నపం మేరకు గ్రామ సర్పంచ్ కదిరి భాస్కర్ స్పందించి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ద్వారా వెంటనే పనులు చేయాలని ఆదేశాలు ఇచ్చారు.కార్యదర్శి వెంటనే స్పందించి జెసిబి ద్వారా చిల్ల చెట్లు తొలగింపు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. టీడీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు గురిజాల పాలయ్య,జిల్లా మాదిగ జర్నలిస్టుల ఫారమ్ అధ్యక్షులు గురిజాల బాబురావు మాదిగ,టిడిపి ఎస్సీ సెల్ విభాగం నాయకులు గురిజాల కాటయ్య, పెద్దయ్య, తదితరులు ఉన్నారు.

పోలీస్ స్టేషన్‌లో వైసీపీ నాయకుల ఫిర్యాదు

విశాలాంధ్ర-చీమకుర్తి : వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి వైయస్ భారతి రెడ్డిలపై మరియు వైసిపి నాయకులు పై సోషల్ మీడియాలో అసభ్యంగా పోస్టులు పెడుతున్నారని టీడీపీ వారిపై చర్యలు తీసుకోవాలని చీమకుర్తి పోలీస్ స్టేషన్లో వైసీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు,ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, శేఖర్ రెడ్డి, సుందర్ రామిరెడ్డి,ప్రతాప్, మల్లికార్జున్ రెడ్డి, పాల్గొన్నారు.

డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర - అద్దంకి : డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన ఉండాలని విశ్రాంత జిల్లా పరిశ్రమల శాఖ అధికారి తాళ్లూరి పీటర్ విద్యార్థులకు సూచించారు.57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు బుధవారం స్థానిక శాఖ గ్రంథాలయంలో జరిగాయి. వారోత్సవాలను పురస్కరించుకొని వివిధ పోటీలలో గెలుపొందిన వంద మంది విద్యార్థులకు గ్రంథాలయం తరఫున బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డోలా పద్మావతి బహుమతులను అందజేశారు. చివరగా గ్రంథపాలకుడు చుండూరి సుగుణరావును ప్రముఖులు శాలువాతో సత్కరించారు.

విద్యా వైజ్ఞానిక విహారయాత్ర

విశాలాంధ్ర - అద్దంకి : స్థానిక కె.ఆర్.కె డిగ్రీ కళాశాల విద్యార్థులు కార్తీక మాసం సందర్భంగా కళాశాల వివిధ విభాగాల ఉపన్యాసకుల బృందం బుధవారం మణికేశ్వరం మల్లేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించారు.ఆలయ చారిత్రక విషయాలను విద్యార్థులకు అధ్యాపకులు వివరించారు. గ్రామంలో ఉన్న నర్సరీని తిలకించి మొక్కల వృద్ధికి అనుసరిస్తున్న సాంకేతిక అంశాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు రాజశేఖర్,షర్మిల రాణి,మస్తాన్ వలి,అశోక్ కుమార్,జీవ శాస్త్ర విభాగపు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'ఏలూరి'కి శుభాకాంక్షలు

విశాలాంధ్ర - మార్టూరు : విజనరి లీడర్ అవార్డు గ్రహీత ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు పర్చూరు నియోజకవర్గ టీడీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం తాడేపల్లి సచివాలయం వద్ద మార్టూరు తెదేపా నాయకులు ఎమ్మెల్యే ఏలూరిని మర్యాదపూర్వకంగా కలిసి విజనరీ లీడర్ అవార్డు అందుకున్నందుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాకోలు వెంకటేశ్వర్లు,గన్నవరం బుడే,కన్నెగంటి శ్రీనివాసరావు మార్టూరు గ్రానైట్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ఇంటూరి ఆంజనేయులు తాటి నాగేశ్వరరావు,ఇంకొల్లు మండల నాయకులు పాల్గొన్నారు.

పంట బీమాతో ఆర్థిక భరోసా

విశాలాంధ్ర - చీరాల రూరల్ : పంట భీమాతో ఆర్థిక భరోసా అందుతుందని చీరాల మండల వ్యవసాయ అధికారి ఐ.సుమతి అన్నారు. మండలంలోని రామకృష్ణాపురం,గాంధీనగర్‌లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు, కౌలు రైతులు గ్రామ వ్యవసాయ సహాయకుల నుండి పంట సాగు ధృవీకరణ పత్రం పొంది ప్రీమియం చెల్లించడం ద్వారా పీఎం ఫసల్ భీమా యోజన పథకం వర్తిస్తుందన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు లావణ్య,ధీరజ్,యానిమల్ హస్బెండరీ సహాయకులు ఏడుకొండలు, సాయి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

భావితరాలకు మంచి పర్యావరణాన్ని అందిద్దాం

కలెక్టర్ జె. వెంకట మురళి

విశాలాంధ్ర - బాపట్ల : మనందరం ప్రకృతిని ప్రేమిద్దాం..కాపాడదాం..భావితరాలకు మంచి పర్యావరణాన్ని అందిద్దామని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు.జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన కార్యక్రమం బుధవారం సూర్యలంక సమీపంలోని నగరవనంలో జరిగింది. కలెక్టర్ ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు నాటగా మరి కొంతమంది జిల్లా అధికారులు ఒక్కొక్కరు మొక్కలు నాటారు. అనంతరం కలెక్టర్ అధికారులంతా సహపంక్తి భోజనం చేశారు.పర్యావరణాన్ని పరిరక్షించడానికి ఆగస్టు 30 నుంచి వన సమారాధన వరకు విస్తృతంగా మొక్కలు నాటాలని సీఎం నారా చంద్రబాబు నాయుడు అన్ని జిల్లాల అధికారులను ఆదేశించారని కలెక్టర్ చెప్పారు.రాబోయే తరాలకు మంచి పర్యావరణం అందించడానికి ఇప్పుడు నాటే మొక్కలు ఎంతో ఉపయుక్తం అవుతాయన్నారు. మనందరం ప్రకృతిని ప్రేమించి చెట్లను, జంతువులు,పక్షులను సంరక్షించాలన్నారు.వనాలను రక్షించుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు. పరిశ్రమల స్థాపనలతో గడిచిన 155 ఏళ్లలో ప్రపంచవ్యాప్తంగా రెండు డిగ్రీల ఉష్ణోగ్రత పెరిగిందన్నారు. ఉష్ణోగ్రతలలో మార్పులను నియంత్రించాలంటే విస్తృతంగా మొక్కలు నాటాలని గ్లోబల్ వార్మింగ్ ప్రకటించిందన్నారు.వన సంరక్షణపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారన్నారు.అటవీశాఖ ద్వారా 63 వేల మొక్కలు నాటినట్లు తెలిపారు.ఇతర శాఖల ఆధ్వర్యంలోనూ జిల్లాలో విస్తృతంగా మొక్కలు నాటాలని చెప్పారు. ముఖ్యంగా సూర్యలంక బీచ్‌లో అందమైన వనం ఏర్పాటు లక్ష్యంతో అధికారులు ముందుకు సాగాలన్నారు.బీచ్‌ల వద్ద ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తే పర్యాటకుల సంఖ్య పెరుగుతారని,పర్యావరణం పచ్చగా ఉంటే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. పర్యావరణం కాపాడటంలో భాగంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రత పాటించడానికి అధికారులంతా కంకణబద్ధులు కావాలన్నారు.అటవీశాఖ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు జరపడం సంతోషదాయకమన్నారు.అధికారులంతా వనంలో కొంత సమయం గడిపేలా కార్తీక వన సమారాధన నిర్వహించడం అభినందనీయమని జిల్లా రెవిన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్ అన్నారు. అధికారులంతా భక్తి భావంతో కార్యక్రమంలో పాల్గొన్నారని,తద్వారా మరింత ప్రత్యేకత సంతరించుకుందన్నారు.మన కుటుంబానికి, జిల్లా ప్రజలకు మంచి జరగాలని కార్తీక వన సమారాధన జరుపుకోవడం సంతోషదాయకమని జిల్లా అటవీ శాఖ అధికారి భీమయ్య చెప్పారు.కార్తీక వన సమారాధనలో ఒకరోజు చెట్ల కింద భోజనం చేయడం మంచి సంప్రదాయంగా కార్యక్రమాలు జరగడం శుభ పరిణామం అని బాపట్ల ఆర్డీవో గ్లోరియా చెప్పారు.

ప్రతి ఒక్కరూ సముద్రంలో పుణ్య స్నానాలు ఆచరించి, భవిష్యత్తు కొరకు పూజలు నిర్వహిస్తారన్నారు.తద్వారా భవిష్యత్తు ఆనందంగా నడుపుతారని వివరించారు.ఈ కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యువత డ్రగ్స్, ధూమపానానికి దూరంగా ఉండాలి

ప్రొఫెసర్ వట్టిప్రోలు అరుణకుమారి

విశాలాంధ్ర - వేమూరు : యువతను చెడు వ్యసనాలకు దూరంగా ఉంచి సన్మార్గంలో నడిపే విధంగా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ వట్టిప్రోలు అరుణకుమారి అన్నారు.బుధవారం మండల కేంద్రమైన వేమూరులో జీసస్ యంగ్ ఆర్మీ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా అరుణ కుమారి చేతుల మీదుగా నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది.అనంతరం అరుణ కుమారి మాట్లాడుతూ సమాజంలో యువతి యువకులు డ్రగ్స్, ధూమపానానికి అలవాటుకు బానిసలై ఉన్నత విద్యావంతులు కాలేకపోతున్నారన్నారు. విద్య ద్వారానే పేదరికం నుండి విముక్తి కలుగుతుందని ఉన్నత విద్యావంతులు అయినవారు సమాజ అభివృద్ధి పట్ల తమ వంతు సహకారం అందించి పల్లెలు, గ్రామాలలో చదువు యొక్క ఆవశ్యకతపై యువతి యువకులకు అవగాహన కల్పించ వలసిన బాధ్యత మిషనరీస్,విద్యావంతులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జీసస్ యంగ్ ఆర్మీ మినిస్ట్రీ డైరెక్టర్ రాజు ఆరమళ్ళ,రెవరెండ్ అబ్రహం, రెవరెండ్ తిమోతి,సంఘస్తులు పాస్టర్లు పాల్గొన్నారు.

పొగాకుకు ప్రత్యామ్నాయంగా పప్పు దినుసులు

విశాలాంధ్ర - మార్టూరు : మండలంలోని బొబ్బేపల్లి గ్రామంలో ఈరోజు పొగాకు ప్రత్యామ్నాయంగా పప్పు దినుసులు మొక్కజొన్న సాగు చేయాలని సహాయ వ్యవసాయ సంచాలకులు కె.వి శ్రీనివాసరావు అన్నారు.బుధవారం రైతులకు అవగాహన కార్యక్రమంలో ఏడిఏ మాట్లాడుతూ పొగాకు అధికంగా సాగు చేయటం వలన డిమాండ్ తగ్గి రైతులు నష్టపోవటం జరుగుతుందని తెలిపారు. ఉద్యానశాఖ అధికారి హనుమంత్ నాయక్, ఎంపీటీసీ దండా హరిబాబు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : పిట్టలవానిపాలెం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి డాక్టర్ మొర్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు నిర్వహించిన 57 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి.ఈ వారోత్సవాల్లో భాగంగా ప్రతి రోజు విద్యార్థులకు నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన వారికి బుధవారం గ్రంథాలయంలో బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథులుగా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ మున్నం చిన్నసుబ్బారెడ్డి,మండల విద్యశాఖ అధికారి ఉయ్యూరు వెంకటేశ్వరరావు పాల్గొనగా రిటైర్డ్ హెడ్మాస్టర్,ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత,నాటకప్రయోక్త,కవి,ఎస్. నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సదరన్ జోన్ క్రీడా పోటీలకు సమాయత్తం కావాలి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : అక్షరాల పట్ల ఉన్న ఆసక్తి ఆటల పట్ల కూడా కలిగి ఉండాలని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ జి.కరుణ సాగర్ పేర్కొన్నారు.వ్యవసాయ కళాశాలలో జరిగిన రెండో దశ ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ అంతర్ కళాశాలల క్రీడల పోటీల ముగింపు సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు.విద్యార్థులు దేహదారుఢ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న ఐ.టి.సి సీనియర్ మేనేజర్ వి.వి.ఆర్ దీక్షిత్ మాట్లాడుతూ క్రీడల ద్వారా స్నేహపూర్వక వాతావరణం లభిస్తుందన్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ యూనివర్సిటీ హెడ్ డాక్టర్ ఆర్.రవికాంత్ రెడ్డి విద్యార్థుల క్రమశిక్షణ వలన మాత్రమే ఈ నాలుగు రోజులపాటు పోటీలను సమర్థవంతంగా నిర్వహించగలిగామన్నారు. సభకు అధ్యక్షత వహించిన వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనా రాణి మాట్లాడుతూ అన్ని వసతులతో కూడిన క్రీడా ప్రాంగణాల వలన ఇక్కడి విద్యార్థులు క్రీడల్లో జాతీయ స్థాయిలో రాణించ గలుగుతున్నారన్నారు. డాక్టర్ జి.వినయ్ కుమార్ క్రీడా బహుమతుల ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించగా, డాక్టర్ డి.వి. సాయిరాం కుమార్ సాంస్కృతిక విజేతల బహుమతుల ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి.డి.స్మిత్, కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.సర్దార్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.డాక్టర్ శ్రీ రేఖ వందన సమర్పణ చేశారు.